మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

బాపట్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష కోసం.. ఈ నెల 15వ తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం తెలిపారు. ఇందుకు ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్ సైట్‌లో సంప్రదించాలన్నారు. పరీక్ష రుసుం 16 లోగా చెల్లించి.. డీఈఓ కార్యాలయంలో 18వ తేదీ లోగా సమర్పించాలన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, జడ్పీ పాఠశాలల్లో 8వ తరగతి చదువుచూ 7వ తరగతిలో 55 శాతం మార్కులు సాధించి, వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉన్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు ఉండాలన్నారు. పరీక్ష రుసుం రూ.100 లు కాగా, ఎస్సీ ఎస్టీలకు రూ.50 అని తెలిపారు.

పైకొచ్చిన.. పాతాళగంగ

- గణనీయంగా పెరిగిన భూగర్భ జలాలు
- అందుబాటులో 66.1 టీఎంసీల నీరు
- వ్యవసాయ బోర్లకు తీరిన నీటి కొరత
- పల్నాడు జిల్లాలో అత్యధికం

కురిసిన మేఘం.. ఊటెక్కిన భూమి!


నకరికల్లు వద్ద బోర్లతో పొలాలకు నీరు

వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. కాలువలకు పుష్కలంగా నీటి పరఫరా జరుగుతోంది. చెరువులు, కుంటలు నిండాయి. భారీ వర్షాలు కురుస్తుండటంతో వాగులకు జలకళ సంతరించుకుంది. ఎక్కడ చూసినా నీటి నిల్వలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. దీంతో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. వ్యవసాయ బోర్ల ద్వారా సమృద్ధిగా పంటలకు నీరు అందుతోంది. కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలా లు 1.25 నుంచి 3 మీటర్ల లోతులోనే అం దుబాటులో ఉన్నాయి. 66.1 టీఎంసీ ల నీరు అందుబాటులోకి వచ్చింది.

(చీరాల, ఆంధ్రజ్యోతి)

భూగర్భ జల కొరత దాదాపు తీరింది. వేసవికి కొన్ని ప్రాంతాల్లో 37 మీటర్ల లోతుకు జలాలు పడిపోతుండేవి. దీంతో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న విషయం విధితమే. ప్రస్తుతం అడుగంటిన వందలాది బోర్లకు మళ్లీ జలకళ సంతరించుకుంది. పల్నాడు జిల్లాలో ప్రధానంగా బొల్లాపల్లి, వెల్దుర్తి, మాచర్ల, దుర్గి మండలాల్లో వేసవిలో ప్రమాదకర స్థాయిలో భూగర్భ జలాలు పడిపోయాయి. ఈ ప్రాంతాల్లో కూడా ప్రస్తుతం భూగర్భ జలమట్టం పెరిగింది. వేసవిలో జిల్లా సగటు భూనీటి మట్టం 11.08 మీటర్లు కాగా ప్రస్తుతం 8.46 మీటర్లకు జలాలు పెరిగాయి. సగటున 2.66 మీటర్ల మేర నీరు పైకొచ్చింది. దుర్గి మండలంలో 7.49 మీటర్లు, వెల్దుర్తిలో 7.43 మీటర్లు, యడ్లపాడులో 6.65 మీటర్లు, అత్యంత నీటి ఎద్దడి మండలమైన బొల్లాపల్లిలో 4.20 మీటర్ల మేర భూనీటి మట్టం పెరిగింది. మూడు మీటర్ల లోపు లోతులో భూగర్భ జలాలు జిల్లాలోని 38.95 శాతం ప్రాంతంలో లభిస్తున్నాయి. 28.42 శాతం ప్రాంతంలో మూడు నుంచి ఎనిమిది మీటర్లలో.. ఎనిమిది నుంచి 20 మీటర్ల లోతులో 23.16 శాతం.. 20 మీటర్ల కన్నా ఎక్కువ లోతులో 9.47 శాతం.. ఉన్నట్టు భూగర్భ జలాల శాఖ వెల్లడించింది.

జిల్లాల వారీగా భూగర్భజల మట్టం

పల్నాడు సాధారణ వర్షపాతం 535.5 మి. మీ కాగా 560.6 మి.మీ వర్షపాతం నమో దైంది. ఈ జిల్లాలో 35.90 టీఎంసీల భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి.

బాపట్ల జిల్లా వేసవిలో సగటు భూ గర్భ నీటి మట్టం 3.93 మీటర్లు కాగా.. ప్రస్తుతం 2.96 మీటర్లకు చేరింది. 0.96 మీటర్ల నీటి మట్టం పెరిగింది. జిల్లా అంతటా నీటి మట్టం పెరగగా అద్దంకి, చినగంజాం, మార్టూరు నీటి మట్టం పెరగలేదు. మూడు మీటర్ల లోపు భూ నీటి మట్టం 65.31 శాతం.. మూడు నుంచి ఎనిమిది మీటర్ల లోపు 32.65 శాతం.. ఎనిమిది నుంచి 20 మీటర్లలోపు 2.04 శాతం ప్రాంతంలో నీరు ఉంది. కొల్లూ రు మండలంలో 3.94 మీటర్లు, వేమూరులో 3.04 మీటర్ల మేర నీటి మట్టం పెరిగింది. బాపట్ల జిల్లా సాధా రణ వర్షపాతం 554.2 మి.మీ కాగా 514.6 మి.మీ నమోదైంది. జిల్లాలో 14.50 టీఎంసీల నీటి నిల్వలు అందు బాటులోకి వచ్చాయి.

గుంటూరు జిల్లాలో వర్షాలు దంచి కొట్టాయి. దీంతో భూగర్భ నీటి మట్టం కూడా 3.69 మీటర్ల మేర పెరిగింది. వేసవిలో జిల్లా సగటు నీటి మట్టం 5.37 మీటర్లు కాగా 1.68 మీటర్లకు పెరిగింది. 81.08 శాతం మూడు మీటర్ల లోతులోనే నీరు ఉంది. 18.92 శాతం మూడు నుంచి 8 మీటర్ల లోపు నీరు లభిస్తోంది. చేబ్రోలు మండలంలో 7.16 మీటర్లు.. గుంటూరులో 5.38 మీటర్లు, కొల్లిపరలో 4.70 మీటర్లు, పెదకాకాని మండలంలో 4.07 మీటర్ల మేర నీటి మట్టం పెరిగింది. జిల్లాలో సాధారణ వర్షపాతం 614.7 మి.మీ కాగా 825.5 మి.మీ నమోదైంది. జిల్లాలో 15.70 టీఎంసీల నీటి నిల్వ అందుబాటులోకి వచ్చింది.


పరాధీనమైన జమ్ములపాలెం రోడ్డులోని అసైన్డ్ భూమి

అనధికార అసైన్డ్‌పై చర్యలేవి?

- అనధికార ఒప్పందాలతో పేదల భూముల చెర
- గత ప్రభుత్వ చట్ట సవరణతో.. వేల ఎకరాల పరాధీనం
- కూటమి కొలువుదీరిన కొత్తలో విచారణకు ఆదేశాలు
- నివేదికల సమర్పణతో సరి.. చర్యలు శూన్యం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పేదలకు ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూమిపై ఎలాంటి క్రయ విక్రయాలు జరపడం, యాజమాన్య హక్కులు కల్పించడం నేరమని చట్టం స్పష్టంగా నిర్వచిస్తోంది. కానీ, జిల్లాలో ఇవేవీ అమల వుతున్న దాఖలాలు మచ్చుకైనా కనిపించడం లేదు. వేల ఎకరాల అసైన్డ్ భూమి పరాధీనమైంది. నిరుపేదలకు కేటాయిం చిన అసైన్డ్ భూమికి యాజమాన్య హక్కులు కల్పించే పేరిట వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్ట సవరణ పరపతి కలిగిన పెద్దలకు వరంగా మారింది. పైరవీలతో ఏకంగా అసైన్డ్‌ను ఫ్రీహోల్డ్ చేయించుకున్న ఉదంతాలు కోకొల్లలు. ఈ మొత్తం వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి.. నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ క్రయవిక్రయాలు జరిపిన వారిపై చర్యలు తీసుకుంటామని అసెంబ్లీ వేదికగా కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇది వెలువడి కూడా ఏడు నెలలు దాటింది. తర్వాత రెవెన్యూ యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా సమగ్ర సర్వే జరిపి నివేదికలను ప్రభుత్వానికి అందించి నాలుగు నెలలు దాటింది. ఇక అంతే ఆ తర్వాత అసైన్డ్ అక్రమాలపై చర్యలేవి అన్న ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానాలు లేవు. అసైన్డ్ అక్రమాలపై ఎలాంటి ముందడుగు పడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అసైన్డ్ అక్రమాలు ఇలా..

ప్రభుత్వం నుంచి 2003 ముందు భూమి పొందిన పేదలు.. యాజమాన్య హక్కు పొందే విధంగా వైసీపీ ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. దీనిని ఆసరాగా చేసుకుని దాదాపు 3,804 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. ఇందులో దాదాపు 80 శాతం చేతులు మారిన (మిగతా 4వ పేజీలో)

వేల ఎకరాల ప్రభుత్వ భూమి..

బాపట్ల, చీరాల రెవెన్యూ డివిజన్‌ల పరిధిలో దాదాపు 60 వేల ఎకరాల ప్రభుత్వ భూమి నాలుగు దశాబ్దాల క్రితం వరకు ఉండేది. ఇందులో దాదాపు ఇప్పటి వరకు 40 వేల ఎకరాలను పేదలకు అసైన్డ్ చేయగా, మరో 20 వేల ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు తెలుస్తోంది. పేదలకు అసైన్డ్ చేసిన భూముల్లో ఇప్పుడు వందల ఎకరాలు కూడా ఒరిజినల్ అసైనీల చేతిలో లేకపోవడం గమనార్హం. నిరుపేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని వారికి తృణమో, పణమో ఇచ్చి అనధికారిక ఒప్పందాల ద్వారా ఏళ్ల తరబడి అసైన్డ్ భూములను బడా బాబులు అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలి నాళ్లలోనే అసైన్డ్ భూ బాగోతాలపై దృష్టి పెట్టింది. అక్రమాలపై అవసరమైతే ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని మరింత పటిష్టం చేయడానికి కూడా వెనకాడబో మనే సంకేతాలను పంపింది. కానీ, ఇంతవరకు చర్యల విషయంలో ఒక్క అడుగు కూడా పడకపోవడంతో అక్రమార్కులు మరింతగా రెచ్చిపోతున్నారు.

క్లాప్‌మిత్రల పనితీరుతోనే జిల్లాకు అవార్డులు

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రాత్రింబవళ్లు క్లాప్‌మిత్రలు పనిచేయడం ద్వారానే బాపట్ల జిల్లాకు విరివిగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు లభించాయని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర జిల్లా అవార్డుల ప్రధానోత్సవం సోమవారం సాయంత్రం జీబీసీ రోడ్డులోని కమ్మ జనసేవా సమితి కల్యాణ మండపంలో నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, మహాత్మా గాంధీ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. రానున్న మూడు నెలల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. వ్యర్థాలను పద్ధతి ప్రకారం తొలిగించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో జనవరి 25న ప్రారంభమైన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను సమర్థంగా ముగించుకున్నామన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర 2047 లక్ష్యాల్లో భాగంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి నెలా ఒక అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకొని లక్ష్యాల సాధన దిశగా ముందుకెళ్తున్నట్లు వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా పనిచేశారని ప్రశంసించారు. చెరుకుపల్లి మండలం కావూరు జడ్పీ ఉన్నత పాఠశాల రాష్ట్రస్థాయి స్వచ్ఛత అవార్డు సాధించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో వివిధ రంగాలకు 49 అవార్డులు లభించడం సంతోషదాయకమన్నారు. వీరంతా పరిశుభ్రమైన బాపట్ల జిల్లాకు రూపశిల్పులుగా ఉన్నారని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధంగా ఎఫ్ఎస్‌టీపీలు ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశామన్నారు. 146 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాపుడా చైరన్ సలగల రాజశేఖర్‌బాబు, ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.వెంకటరమణ, చిన్న శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, ఆర్డీవో పి.గ్లోరియా, డీపీఓ ప్రభాకరరావు, మెప్మా పీడీ సత్యానంద్ పాల్, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులు పాల్గొని ప్రసంగించారు.



కమిషనర్ జి.రఘునాథరెడ్డి, మెప్మా పీడీ సత్యఆనంద్‌పాల్‌కు అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

చర్చి ఫాదర్‌తో.. సముద్రస్నానానికి వెళ్లిన వివాహిత మృతి

చినగంజాం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సముద్ర స్నానానికి వెళ్లిన యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మోటుపల్లి సముద్ర తీరం వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శీలం రమేష్ వివరాల ప్రకారం.. బాపట్ల మండలం అడవి పంచాయతీ పరిధిలోని అడవిపల్లెపాలేనికి చెందిన ఓసిపిల్లి రాజు, శాంతికుమారి(29) భార్య భర్తలు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజు చేపల వేట చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజు చేపల వేటకు వెళ్తూ.. నాలుగు రోజుల క్రితం వేటపాలెం మండలం పాత రెడ్డిపాలెంలోని తన భార్య చెల్లెలు దీనదనమ్మ నివాసంలో శాంతికుమారిని, పిల్లలను వదలి వెళ్లాడు. అడవిపల్లెపాలెంలోని చర్చిలో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరుకు చెందిన సలగల వినమ్ ఫాదర్‌గా ఉన్నాడు. శాంతికుమారి చర్చికి వెళ్తూ ఉంటుంది. ఈ క్రమంలో వీరిద్దరికి అక్కడ పరిచయం ఏర్పడింది. సోమవారం ఇద్దరూ కలిసి మోటుపల్లి సముద్ర తీరప్రాంతానికి వెళ్లారు. సముద్రంలో అలల తాకిడికి ఇద్దరూ సముద్రంలో లోపలికి వెళ్లారు. వినయ్ బయటకు వచ్చినప్పటికీ, అలలకు చిక్కుకొని శాంతకుమారి మృతిచెందింది. ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. శాంతి కుమారి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

40 శాతం ప్రకృతి వ్యవసాయ విస్తరణే లక్ష్యం

ఎక్స్ అఫీషియో కార్యదర్శి బుడితి రాజశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న బుడితి రాజశేఖర్

గుంటూరు సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం విజయవంతం అయ్యేందుకు ప్రభుత్వ అంకితభావమే ప్రధాన కారణమని వ్యవసాయ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి బుడితి రాజశేఖర్ పేర్కొన్నారు. రాబోయే నాలుగేళ్లలో రాష్ట్రంలో 40 శాతం ప్రకృతి వ్యవసాయం విస్తరించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. బ్రెజిల్ ప్రతినిధులతో సోమవారం గుంటూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రెండు రోజులుగా తూర్పు గోదావరి జిల్లాలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన బ్రెజిల్, యూఏఈ, శ్రీలంక దేశాలకు చెందిన 30 మంది ప్రతినిధులు తమ అనుభవాలు, పరిశీలించిన అంశాలను ఈ సమావేశంలో పంచుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో వస్తున్న సానుకూల మార్పు, ముఖ్యంగా మహిళలు పోషిస్తున్న క్రియాశీలక పాత్రను బృంద సభ్యులు ప్రత్యేకంగా ప్రశంసించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ మద్దతు, ప్రజా భాగస్వామ్యం, అంతర్జాతీయ పర్యటనలు సుస్థిర వ్యవసాయం బలోపేతంలో కీలక అంశాలని స్పష్టం చేశారు. బ్రెజిల్ వ్యవసాయ అభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన వివియన్ లిబోరియో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయంలో చేస్తున్న అగ్రో ఎకాలజీ ప్రయత్నాలు బ్రెజిల్‌లో కుటుంబ వ్యవసాయం, సహకార వ్యవస్థలు, రసాయన వినియోగం తగ్గించే చర్యలతో సమాన దిశలో సాగుతున్నాయన్నారు. "నా" పార్టనర్స్ వ్యవస్థాపకుడు వాల్టర్ లింక్, బ్రెజిల్ బృంద సభ్యులు జోయిస్ రెండు రోజుల క్షేత్ర పర్యటనలో మట్టి ఆరోగ్యం, సూక్ష్మజీవ శాస్త్రం, బయో స్టిమ్యులెంట్లు, సంవత్సరం పొడవునా భూమి రక్షణ పంటలు, తొమ్మిది ప్రకృతి వ్యవసాయ సూత్రాల అనుసంధానంపై నేర్చుకున్న పాఠాలను వివరించారు. అమెజాన్‌కు చెందిన మారియో బ్రాగా డి గోస్ వాస్కోన్సెలోస్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా వివిధ పర్యావరణ పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ నమూనాను అనుసరించేందుకు ఇది ఒక మార్గదర్శకంగా నిలిచిందన్నారు. సుస్థిర, పునరుత్పత్తి వ్యవసాయంలో రాష్ట్ర నాయకత్వాన్ని మరొకసారి నిర్ధారించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీరజ, ఇంటర్నేషనల్ కో- ఆప రేషన్ ఇన్‌చార్జి స్వాతి,సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం

- మైనింగ్ సీనరేజ్ వసూళ్లకు చెక్‌పోస్టు బాక్స్‌ల ఏర్పాటు
- వీటి నిర్వహణకు అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు..
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

బల్లికురవ, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ మైనింగ్ సీనరేజ్ వసూళ్లకు ఏఎంఆర్ ప్రైవేట్ కంపెనీ పలు ప్రాంతాల్లో తనిఖీలకు చెక్ పోస్టు బాక్సులను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ కోసం విద్యుత్ చౌర్యానికి పాల్పడుతోంది. విద్యుత్ శాఖ అధికారులు సాధారణ ప్రజలు.. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే నానా హడావుడి చేస్తారు. కానీ, ఇలా రోడ్ల వెంబడి ఇష్టానుసారం విద్యుత్ వైర్లను ఏర్పాటు చేసి.. కనెక్షన్లు తీసుకున్నా.. ఎవరు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మైనింగ్ సీనరేజ్ వసూళ్ల చేసే చెక్ పోస్టులకు నిబంధనల ప్రకారం విద్యుత్ కనెక్షన్ మంజూరయ్యే అవకాశాలు లేవు. అయినప్పటికి వారు విద్యుత్‌ను ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, మెయిన్ లైన్లు, గృహాలు, గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి ఇష్టానుసారంగా విద్యుత్‌ను పొందుతున్నారు.


వేమవరం నాలుగు రోడ్ల కూడలిలో గ్రానైట్ ఫ్యాక్టరీ నుంచి చెక్ పోస్టుకు విద్యుత్ కనెక్షన్

ఏఎంఆర్‌కు సీనరేజ్ వసూళ్ల బాధ్యత..

గ్రానైట్ మైనింగ్ సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ప్రభుత్వం ఈ నెల ఒకటవ తేదీ నుంచి ఏఎంఆర్ ప్రైవేట్ కంపెనీకి అప్పగించింది. వారు ప్రతి నెలా ప్రభుత్వానికి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సీనరేజ్ వసూళ్ల చేసి రూ.47 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. ఇందుకోసం ఏఎంఆర్ కంపెనీ బల్లికురవ, మార్టూరు, సంతమాగులూరు మండలాల పరిధిలో 35 చోట్ల వాహనాల తనిఖీలు, సీనరేజ్‌ల చెల్లింపులకు చెక్ పోస్టు బాక్సులను ఏర్పాటు చేసింది. ఈ బాక్సులలో సీసీ కెమెరాలు, ఫ్యాన్, కంప్యూటర్, బయట ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేశారు. వాటికి అవసరమైన విద్యుత్ పొందేందుకు.. ఎక్కడా మీటర్లు ఇంత వరకు ఏర్పాటు చేయలేదు. మల్లాయపాలెం గ్రామ సచివాలయం నుంచి, అదే గ్రామంలో అంజనేయస్వామి దేవాలయం నుంచి మరో బాక్సుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. కొండాయపాలెం ప్రభుత్వ పాఠశాల నుంచి, వీర్ల గంగమ్మ దేవాలయం ముందు, బల్లికురవ నాలుగు రోడ్ల జంక్షన్‌లో మెయిన్ విద్యుత్ తీగల నుంచి విద్యుత్ చౌర్యానికి పాల్పడు తున్నారు. ఇలా మిగిలిన చెక్ పోస్టు బాక్స్‌లకు కూడా విద్యుత్‌ను అందిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు మాత్రం ఈ విద్యుత్ చౌర్యంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు వెంటనే చెక్ పోస్టుల బాక్సులను తనిఖీ చేసి, అక్రమంగా పొందుతున్న విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని కోరుతున్నారు.


మల్లాయపాలెం గ్రామ సచివాలయం నుంచి ప్రైవేట్ చెక్ పోస్టుకు విద్యుత్ కనెక్షన్


విద్యుత్ మీటర్ లేకుండానే మెయిన్ లైన్‌పై ఏఎంఆర్ బాక్సుకు విద్యుత్ కనెక్షన్

జ్వాలాముఖికి బంగారు నానుతాడు బహూకరణ





బంగారు నానుతాడు రశీదును ఈఓ రేఖకు అందజేస్తున్న రవిశంకర్‌శర్మ (ఇన్‌సెట్లో) నానాతాడు, నాను కోడు

అమరావతి, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాలచాముండికా సమేత అమరేశ్వ రాలయ ఉపాలయాల్లో ఒకటైన జ్వాలాముఖి అమ్మ వారికి అమరావతికి చెందిన భక్తుడు శంకరమంచి రవిశంకర శర్మ దంపతులు సోమవారం రూ.5లక్షల విలువైన బంగారు నానుతాడు, నానుకోడు కానుకగా సమ ర్పించారు. దేవస్థాన సహాయ కమిషనర్ రేఖకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సుధీర్‌శర్మ పాల్గొన్నారు.

పోటాపోటీగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు



రసవత్తరంగా సాగుతున్న ఎద్దుల పోటీలు

క్రోసూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం గ్రామంలో ఐదు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు సోమవారం ముగింపు దశకు చేరుకున్నాయి. సీనియర్స్ విభాగంలో సాయంత్రం పోటీలు ప్రారంభమ య్యాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఒంగోలు జాతి ఎడ్లు పది జతలు పోటీలో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. నిర్ణీత 25 నిమిషాల్లో ఎక్కువ అడుగులు లాగిన జతను విజేతగా ప్రకటిస్తామన్నారు. ప్రథమ బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ బైక్, తర్వాతి స్థానాల్లో నిలిచిన ఎడ్ల జతలకు రూ.60వేలు, రూ.40వేలు, రూ.30వేలుతో పాటు షీల్డులు బహూకరించనున్నట్లు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా రాధాకృష్ణ, దుగ్గి శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి వ్యవహరించారు.

వ్యక్తిగత కక్షలతో హత్య



గుంటూరు శివ (ఫైల్‌ఫొటో)

వినుకొండటౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కక్షల నేపథ్యంలో పంట పొలానికి వెళ్లిన వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసిన ఘటన మండలంలోని ఏనుగుపాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గుంటూరు శివ (37)ను పంట పొలంలోని వర్షపు నీటి పంపిణీలో జరిగిన ఘర్షణలో హత్య చేసి ఉండవచ్చని ఇన్‌చార్జి సీఐ బాలాజీ అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం మేరకు ఇన్‌చార్జి డీఎస్పీ హనుమంతరావు, సీఐ బాలాజీ ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు భాను వివరాల మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అతనికి మద్యం తాగాలనిపిస్తే.. ఆ రోజు ఒక బైకు మాయం

● ఏడాదిన్నరలో 50 ద్విచక్ర వాహనాలు చోరీ ● ఎట్టకేలకు దొంగను పట్టుకున్న కొత్తపేట పోలీసులు



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి

గుంటూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తాగుడికి డబ్బులు అవసర మైనప్పుడు.. అత్తారింటికి వచ్చినట్లు గుంటూరు వస్తాడు. నగరంలో ఏదో ఒకచోట పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని సరదాగా క్షణాల్లో తాళం తీసి వేసుకొని వెళ్లిపోతాడు. అది ఎంతటి ఖరీదైనదైనా.. సరే కేవలం రూ.5 వేలకు తాకట్టు పెట్టి ఆ మొత్తంతో జల్సా చేస్తాడు. ఆ డబ్బు అయిపోగానే.. మళ్లీ చోరీ రిపీటు.. ఇలా గురజాలకు చెందిన బొప్పూరి మల్లికార్జునరావు అలియాస్ పున్నారావు అలియాస్ పెద్ద ఆంజనేయులు ఏడాదిన్నరగా ఇప్పటివరకు 50 ద్విచక్ర వాహనాలు కొట్టేశాడు. వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని ఎట్టకేలకు కొత్తపేట పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి రూ. 25 లక్షల ఖరీదైన 50 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మల్లికా ర్జునరావుతో పాటు అతని వద్ద బైకులు చేసిన గురజాలలోని బైకు మెకానిక్ రాజశేఖర్, మహేష్ అనే గొర్రెల కాపరి, సాతులూరుకు చెందిన బేల్దారు మేస్త్రి సాంబశివరావును కూడా అరెస్ట్ చేశారు. ఈ మేరకు సోమవారం నగరంపాలెంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ మీడియా సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి, రైల్వే స్టేషన్, గుంట గ్రౌండ్స్ ఇతర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని చర్యలు తీసుకోవాలని ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరిని ఎస్పీ ఆదేశించారు. సీఐ వీరయ్య చౌదరి నేతృత్వంలో ఎస్సై రమేష్, పోలీస్ బృందంతో ప్రభుత్వ ఆసుపత్రి, రైల్వే స్టేషన్ ప్రాంతాల వద్ద నిఘా పెట్టారు బొప్పూరి మల్లికార్జున రావు ఈ బైకు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు కనిపెట్టారు. మాయ బజార్‌లోని గౌరీ శంకర్ థియేటర్ పరిసరాల్లో దొంగిలించిన బైకులు అమ్మడానికి తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. అనారోగ్యంతో గుంటూరు జీజీహెచ్‌లో చేరి, ఇక్కడే లాడ్జిలో ఉంటూ బేల్దారు పనులు చేసుకుంటున్నట్లు నిందితుడు పోలీసు విచారణలో వెల్లడించాడు. వచ్చిన డబ్బులతో తాగుతూ ఉండేవాడి నని చెప్పాడు. ఇక పనులు చేయకుండా.. తాగడానికి అవసరమైన డబ్బుల కోసం బైక్ దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నట్లు ఒప్పుకున్నాడు. చోరీకి గురైన 13 ద్విచక్ర వాహనాల యజమానులను గుర్తించాల్సి ఉందని ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ వీరయ్య చౌ దరిని, ఎస్సై రమేష్‌ని, క్రైమ్ టీం సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

శుద్ధజలాల సరఫరాకు స్పష్టమైన ప్రణాళిక

ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల శిక్షణలో కలెక్టర్ వినోద్‌కుమార్



జ్యోతిప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధ జలాలు సరఫరా చేసేలా ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టమైన ప్రణాళిక ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. జల సంరక్షణ ప్రణాళికపై స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో నాలుగు జిల్లాల ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన మూడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జలవనరుల సంరక్షణ, అభివృద్ధిలోనూ ప్రజల సహకారం ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ నీటిసరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. ఇలాంటి శిక్షణలు వ్యక్తిత్వాన్ని మారుస్తాయని, విధుల పట్ల బాధ్యతను మరింత పెంచుతాయని అభిప్రాయపడ్డారు. ఇదే విస్తరణ శిక్షణ కేంద్రంలో తను కూడా ఐఏఎస్ అధికారిగా శిక్షణ పొందానని కలెక్టర్ తెలిపారు. జల జీవన్‌మిషన్ పనులు పక్కాగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జలవనరుల సుస్థిరాభివృద్ధి, తాగునీటి నిరంతర సరఫరా లక్ష్యంతో అధికారులు పనిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ పేర్కొన్నారు. జల సంరక్షణ ప్రణాళికలు గ్రామస్థాయిలో రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పర్యవేక్షణ ఇంజనీర్ రాఘవులు, ఎస్ఈ అనంతరాజు, డీపీఓ ప్రభాకరరావు, శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు పాల్గొన్నారు.

నూజివీడు సీడ్స్ అధినేత వెంకట్రామయ్యకు ఘన నివాళి



నూజివీడు సీడ్స్ అధినేత మండవ వెంకట్రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నూజివీడు సీడ్స్ అధినేత దివంగత మండవ వెంకట్రామయ్య రైతాంగానికి చేసిన సేవలు వెలకట్టలేనివని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం పేర్కొన్నారు. నూజివీడు సీడ్స్ ద్వారా నాణ్యమైన హైబ్రీడ్ విత్తనాలను అభివృద్ధి చేసి, సరఫరా చేయడం ద్వారా ఎంతోమంది పత్తి రైతులకు మార్గదర్శకులయ్యారన్నారు. నూజివీడు మండలం తుక్కులూరు గ్రామంలో జరిగిన వెంకట్రామయ్య దశ దినకర్మ కార్యక్రమానికి ప్రత్తిపాటి హాజరై వెంకట్రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకట రామయ్య కుమారుడు ఎన్ఎస్ఎల్ గ్రూపు సంస్థల చైర్మన్ ప్రభాకరరావు, ఇతర కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. చిలకలూరిపేట ప్రాంతానికి చెందిన ప్రముఖ పత్తి వ్యాపారులు, నూలు మిల్లుల నిర్వాహకులు కందిమళ్ళ శ్రీనివాసరావు, సామినేని కోటేశ్వరరావు, గోరంట్ల పున్నయ్య చౌదరి, ఎం.లింగయ్యచౌదరి, పెరవలి కోటిరావు, లంకా రఘురామిరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

సీఆర్డీఏ భవనానికి హంగులు



సీఆర్డీఏ కార్యాలయం వద్ద అధికారులతో ఏడీసీ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ పార్థసారథి

తుళ్లూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సీఆర్డీఏ కొత్త భవనం రంగుల హంగులతో ముస్తాబవుతోంది. అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీ పార్థసారథి ఆదేశాల మేరకు సీఆర్డీఏ భవనం ఎదుట ఆకర్షణీయమైన, ఏడాది పొడవునా పూసే పూల మొక్కలను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. వెంకటపాలెం ఏడీసీ నర్సరీలో ప్రత్యేకంగా పెంచుతున్న మొక్కలను ఇక్కడ ప్లాంటేషన్ చేస్తున్నారు. శీతల దేశాల్లో ఎక్కువగా కనిపించే టబూబియా అర్జెంషియా, అవలాండా, కాస్సియా పిస్టులా, మిల్లింగ్ టోనియా, కాస్సియా జవానికా, ప్లుయేరియా వంటి విలువైన మొక్కలు తెలుపు, గులాబీ, పసుపు రంగుల్లో పూలు పూస్తాయి. వీటిని సీఆర్డీఏ భవనం ఎదుట, పరిసర ప్రాంతాల్లో సుమారు 300 మొక్కల ఏర్పాటుకు ఏడీసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇక్కడ చేపడుతున్న పచ్చదనం అభివృద్ధి పనులకు ఏడీసీ నర్సరీ మొక్కలు కావడంతో కేవలం రూ.16 లక్షలు మాత్రమే ఖర్చు చేస్తున్నారు. సీఆర్డీఏ పార్కింగ్, వీఐపీ పార్కింగ్, క్యారిడార్ల వెంట కనువిందు చేసేలా గ్రీన్‌లాన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

దర్యాప్తు పూర్తయితే చార్జిషీట్ వేయలేదేం?

- మృతురాలే వాంగ్మూలమిచ్చినట్లు కొత్త కథ అల్లారు
- విద్యార్థిని మృతి కేసులో పోలీసుల దర్యాప్తు తీరుపై హైకోర్టు అసహనం..
- కోర్టు ఉత్తర్వులంటే గౌరవం లేదని ఘాటు వ్యాఖ్య
- తదుపరి విచారణ ఈ నెల 10కి వాయిదా

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా బుడంపాడులోని సెయింట్ మేరీస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన పాలిటెక్నిక్ విద్యార్థిని మృతి ఘటనపై దర్యాప్తు పూర్తి చేసి, చార్జిషీట్ దాఖలు చేయకపోవడం పట్ల హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. విద్యార్థిని మృతి విషయంలో దాఖలైన రిట్ పెండింగ్‌లో ఉండటంతో చార్జిషీట్ వేయలేదన్న పోలీసుల వాదనను తప్పుపట్టింది. దర్యాప్తు పురోగతిపై పోలీసులు దాఖలు చేసిన అఫిడవిట్‌ను పరిశీలిస్తే, కోర్టు, భవనంపై నుంచి తాను పడిపోయినట్లు మృతురాలే వాంగ్మూలం ఇచ్చిందని అందులో పేర్కొనడాన్ని ఆక్షేపించింది. పోలీసులు కొత్త కథ అల్లారని వ్యాఖ్యానించింది. ఆస్పత్రికి తీసుకొచ్చే సమయానికే విద్యార్థిని మృతి చెందినప్పుడు.. మరణ వాంగ్మూలం నమోదు చేయడం ఏ విధంగా సాధ్యమని ప్రశ్నించింది. చార్జిషీట్ దాఖలు చేయవద్దని కోర్టు నుంచి నిషేధ ఉత్తర్వులేమీ లేవు కదా అని పోలీసులను ప్రశ్నించింది. కోర్టుల ఉత్తర్వుల పట్ల పోలీసులకు గౌరవముంటుందని తాము భావించడం లేదని వ్యాఖ్యానించింది. కోర్టులన్నా, కోర్టు సిబ్బంది అన్నా, కోర్టు ఉత్తర్వులన్నా పోలీసులకు గౌరవం లేదని ఘాటుగా వ్యాఖ్యలు చేసింది. పోలీసులు వేసిన అఫిడవిట్‌ను పరిశీలించి వాదనలు వినిపించేందుకు పిటిషనర్‌కు వెసులుబాటు కల్పిస్తూ, తదుపరి విచారణను ఈ నెల పదోతేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టుదేవానంద్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. గుంటూరు జిల్లా గోపాయపాలేనికి చెందిన గన్నెపూడి శ్రావణ సంధ్య (17) అనే విద్యార్థిని బుడంపాడు సెయింట్ మేరీస్ ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లమో మొదటి సంవత్సరం చదువుతూ, కళాశాల హాస్టల్‌లోనే ఉంటోంది. శ్రావణ సంధ్య హాస్టల్‌లోని నాలుగో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడిపోయినట్లు 2017 ఫిబ్రవరి 28న వార్డెన్ నుంచి తల్లిదండ్రులకు ఫోన్ వెళ్లింది. ఈ ఘటనపై గుంటూరుజిల్లా నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తన కుమార్తెను హత్య చేశారని, పోలీసులు కేసును సక్రమంగా దర్యాప్తు చేయడం లేదని పేర్కొంటూ మృతురాలి తల్లి 2017లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఘటనపై సీఐడీ లేక సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా, దర్యాప్తులో పురోగతి లేకపోవడంపై న్యాయమూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తే యువతి ప్రమాదవశాత్తు పడిపోయిందని తెలుస్తోందని, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేరని ఒకవైపు చెబుతూ, మరోవైపు ఈ ఘటనపై ప్రత్యక్ష సాక్షులు, హాస్టల్ విద్యార్థులు వాంగ్మూలాలు ఇచ్చారంటూ పరస్పర విరుద్ధ వివరాలను ఎలా వెల్లడిస్తారంటూ ఆయన తప్పుపట్టారు. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తును సీబీఐకు అప్పగించడమే సముచితమని అభిప్రాయపడ్డారు. కేసు దర్యాప్తు పురోగతిపై వాస్తవాలు పేర్కొంటూ అఫిడవిట్ వేయాలని గుంటూరు ఎస్పీని ఆదేశించారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా, హోంశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది జయంతి వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు ముగిసిందని, రిట్ పిటిషన్ పెండింగ్‌లో ఉందనే కారణంతో పోలీసులు తుదినివేదిక దాఖలు చేయలేదన్నారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా దర్యాప్తు పురోగతిపై జిల్లా ఎస్పీ అఫిడవిట్ దాఖలు చేశారన్నారు. విద్యార్థిని భవనంపై నుంచి పడిన సీసీటీవీ ఫుటేజీ, సాక్షుల వాంగ్మూలాలు, పోస్టుమార్టమ్ రిపోర్ట్‌ను అఫిడవిట్‌కు జత చేశామని తెలిపారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ...రిట్ పెండింగ్‌లో ఉందనే కారణంతో చార్జిషీట్ దాఖలు చేయలేదన్న వాదన పై అసంతృప్తి వ్యక్తం చేశారు.

'ఎమ్మెస్సీ యోగా' నోటిఫికేషన్ విడుదల



ఏఎన్‌యూ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వ్యాయామ కళాశాలలో ఏడాది జీపీ డిప్లమో ఇన్ యోగా ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్, రెండేళ్ల ఎమ్మెస్సీ ఇన్ యోగా ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్, యోగా లేటరల్ ఎంట్రీ కోర్సులలో మంగళవారం నుంచి ఈ నెల 20 వరకు ప్రవేశాలు జరుగు తాయని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పాల్‌కుమార్ సోమవారం తెలిపారు. ప్రవేశాలు తమ కార్యాలయంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఎంఎస్సీ యోగా కోర్సులో ప్రవేశానికి డిగ్రీ ఉత్తీర్ణత, ఎమ్మెస్సీ యోగ లేటరల్ ఎంట్రీ కోర్సుకి ఏఎన్‌యూ పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్స్ పూర్తిచేసి ఉండాలని తెలిపారు. పీజీ ప్రవేశాల కార్యాలయం భర్తీ చేసిన అనంతరం.. మిగిలిన సీట్లకు మాత్రమే తాము ప్రవేశాలు కేటాయిస్తామని పేర్కొన్నారు.

యడ్లపాడు ఏఈఎల్‌సీ హైస్కూల్

గుర్తింపు పునరుద్ధరించండి

● 12ఎకరాల భూమి కొట్టేసే ప్రయత్నాలను అడ్డుకోండి



ఆర్‌జేడీకి వినతి పత్రం అందిస్తున్న ఏఈఎల్‌సీ ప్రతినిధులు

గుంటూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుమారు 70 ఏళ్ల చరిత్ర కలిగిన యడ్లపాడు లూథరన్ హైస్కూల్ గుర్తింపును పునరుద్ధరించాలని ఏఈఎల్‌సీ ప్రతినిధులు పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీకి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రతినిధులు ఏఈఎల్‌సీ కంట్రోలర్ కార్యదర్శి జేసు రత్నకుమార్, పరిపాలనా అధికారి జోసఫ్ పీఎస్ మాట్లాడుతూ యడ్లపాడులో లూథరన్ సంఘ విద్యాలయం అభివృద్ధికి కేటాయించిన 12 ఎకరాల భూమిని కొట్టేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే.. లూథరన్ హైస్కూల్‌కు కొంచెం దూరంలోనే.. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్దేశపూర్వకంగా జడ్పీ ఉన్నత పాఠశాలను నిర్మించారన్నారు. ఈ స్కూల్ నుంచి పిల్లలను పక్క స్కూల్‌కి తరలించారని, దీంతో ప్రస్తుత విద్యా సంవత్సరానికి అధికారులు గుర్తింపు నిరాకరించారని వివరించారు. స్కూల్ ఆస్తిపై కన్ను వేసిన వారిని వెంటబెట్టుకుని డిప్యూటి జిల్లా విద్యాధికారి స్కూల్ రికార్డులు స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రెవ. బాబురావు, రేవ.శ్యాం సంపత్, రేవ. ఇసుకపాటి శ్యాం, రేవ సతీష్, కార్పొరేటర్ రాజులత, ట్రినిటీ పారిష్, నార్త్, ఈస్ట్ , వెస్ట్ పారిష్ ప్రతినిధులున్నారు.

బైకును ఢీకొట్టిన లారీ.. ఒకరి మృతి

తెనాలి అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న ముగ్గురిని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో.. ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. వైకుంఠపురం - జగ్గడిగుంటపాలెం వంతెనల మధ్య సోమవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గార్మి పండగకు తెనాలి వచ్చి.. స్వగ్రామం అప్పికట్లకు ముగ్గురూ వెళ్తున్నారు. ఈ ఘటనలో షేక్ నాయబ్ రసూల్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన గౌస్‌బాషా, మరొక బాలుడిని ప్రభుత్వ వైద్యశాలలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అనధికార అసైన్డ్‌పై చర్యలేవి ?

(3వ పేజీ తరువాయి)

అసైన్డ్ భూమేననేది సమాచారం. ఆగమేఘాల మీద దాదాపు 280 ఎకరాలు రిజిస్ట్రేషన్ కూడా జరిగినట్లు రెవెన్యూ విభాగం ఇచ్చిన నివేదికలో పొందుపరిచారు. రాజకీయ పరపతిని ఉపయోగించుకుని గత ప్రభుత్వంలో దాదాపు 1,500 ఎకరాల అసైన్డ్ భూమిని గుట్టుచప్పుడు కాకుండా ఫ్రీహోల్డ్ చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ తంతు ఇప్పుడు కూడా నడుస్తూ ఉండడం ఆందోళన కలిగించేదిగా ఉంది. అసైన్డ్ భూమల్లో రొయ్యల సాగు మత్స్యశాఖ లెక్కల ప్రకారం 2,800 ఎకరాలుగా తేలింది. ఈ సంఖ్య 8 వేల ఎకరాల వరకు ఉండొచ్చని సమాచారం. ఈ సాగు మొత్తం అనధికారిక ఒప్పందాల ద్వారా అసైన్డ్ భూమిని చెరబట్టిన వారే చేస్తుండడం గమనార్హం. బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణం చేపడుతున్న భూమి అసైన్డ్ కాగా, దానిని విరాళం ఇచ్చారని చెప్పి గత ప్రభుత్వంలో సన్మాన సత్కారాలకు తెరతీయడం ఓ వింత. ఇక కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులంతా కలిసి అసైన్డ్ భూములను కొనుగోలు చేయడం చూస్తే.. చట్టాలంటే లెక్కలేని తనానికి నిదర్శనంగా కనబడుతోంది. వీరికి గత పాలకుల అండదండలు లభించడం మరో విశేషం. వివిధ వేదికల మీద టీడీపీ నేతలు నిర్వహించిన ప్రజాదర్బార్‌లలో ఏకంగా 850 ఫిర్యాదులు రాగా ఇందులో 70 శాతం అసైన్డ్ లావాదేవీలకు సంబంధించినవే ఉండడం విస్తుగొలిపేదిగా ఉంది.

ఎందుకీ జాప్యం...

రెవెన్యూ విభాగం ఇచ్చిన నివేదికల్లోనే అసైన్డ్ అక్రమాలు నిజమని తేలింది. గత ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ చేసిన భూముల వివరాలు పాలకుల దగ్గర ఉన్నాయి. వీటన్నింటిని ప్రభుత్వం నిబంధనల ప్రకారం తిరిగి స్వాధీనం చేసుకుంటే వేల ఎకరాల ల్యాండ్ బ్యాంకుగా మారనుంది. జిల్లాను పారిశ్రామి కంగా అత్యున్నత స్థాయిలో నిలపడానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది. మరెంతో మంది నిరుపేదలకు ఆ భూమి వరంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం అసైన్డ్ అక్రమాలపై కొరడా ఝుళిపించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	133, 142, 153
చికెన్ విత్ స్కిన్(కిలో)	254.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	264.00

27,562 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 29,714 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 27,562 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,273 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12000
334	10500	14200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14300	334	10500	14300
273	---	---	నెంబరు. 5	10000	14000
341	10000	14600	273	----	----
4884	----	----	341	10000	15000
సూపర్ 10	----	----	4884	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14800	తేజ	10000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10000	15000	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

సమస్యల పరిష్కారంలో జవాబుదారితనంతో వ్యవహరించాలి

● ఎస్పీ బి.ఉమామహేశ్వర్


అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు పరిష్కరించటంలో జవాబుదారితనంతో వ్యవహరించాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 64 మంది అర్జీదారులు వారి సమస్యలను ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఎస్పీకి విన్నవించుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజ సమస్యలు పరిష్కరించటంలో జవాబుదారితనంతో వ్యవహరించాలని అధికారులకు తెలిపారు. అర్జీలను పరిష్కరించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని జిల్లా పోలీసు అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ యు.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు ఆనందంగా ఆడుకునేలా పార్కులు సిద్ధం చేయాలి : కలెక్టర్

బాపట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పిల్లలు ఆనందంగా ఆడుకునేలా పార్కులు సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని వివేకానందకాలనీ పార్కును సోమవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ నెల 20వ తేదిన పార్కును ప్రారంభం చేయాలని చెప్పారు. పార్కులో పిల్లలు ఆడుకునే పరికరాలను ఏర్పాటు చేయాలని అలాగే వాకింగ్ ట్రాక్, జిమ్ సామగ్రిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతివార్డులో ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నాయో పరిశీలించి, ఓ పార్కు ఉండే విధంగా ప్రణాళికను సిద్ధం చేయాలని ఆర్డీవో పి.గ్లోరియాకు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు, వివేకానందకాలనీ పెద్దలు పాల్గొన్నారు.


వివేకానంద కాలనీలోని పార్క్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, అధికారులు

గిరిజన కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

బాపట్ల రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : గిరిజన కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలంటూ నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దేవరకొండ రాము గిరిజన వాసులతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కలెక్టరేట్ ఆవరణలో విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన కాలనీవాసులకు గృహనిర్మాణ సంస్థ ద్వారా ఆర్థికసాయంతోపాటు ప్రభుత్వం ఏదైనా స్వచ్ఛంద సంస్థ ద్వారా మరో రూ.2 లక్షల 50 వేల సహాయం అందించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

బాపట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో భాగంగా అప్పికట్ల గ్రామంలో రైతులకు సోమవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ హుస్సేన్ కార్యక్రమాన్ని ప్రారంభించి రైతులకు జీవామృతం, ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి అవగాహన కల్పించారు. రైతులంతా సహజ సిద్ధంగా లభించే ఔషధాలను ఉపయోగించుకొని, ప్రకృతిని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ మోహన్, అమర్‌నాథ్, రాజేశ్, విజయ్, శ్రీకాంత్, గిరీశ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగంతో ప్రమాదంలో విద్యార్థుల భవితవ్యం

● ఈగల్ టీమ్ డీఎస్పీ జగదీష్‌నాయక్

బాపట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వినియోగం విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఈగల్ టీమ్ డీఎస్పీ జగదీష్ నాయక్ అన్నారు. బాపట్ల పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ పొందుతున్న నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగంతో శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత దెబ్బతింటుందని, కుటుంబాలు ఛిద్రమవుతాయని అన్నారు. నూతన ఉపాధ్యాయులు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని కోరారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఈగల్‌టీమ్ డీఎస్పీ జగదీష్‌నాయక్

ఘనంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది మహోత్సవం

పిట్టలవానిపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో ఉన్న శ్రీకాశీ విశ్వనాధ దేవస్థానంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది మహోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నాయకులు గోకరాజు సుబ్బరాజు, ప్రధానవక్తగా ఆంధ్రప్రదేశ్ సక్షం కార్యవాహ కృష్ణమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు దేశ స్థితిగతులు, సమాజంలో ఆర్ఎస్ఎస్ పాత్ర, స్వయంసేవక్‌ల సేవా కార్యక్రమాలు, శతాబ్ది ఉత్సవాల ప్రాధాన్యత గురించి ప్రసంగాలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ గోపి, బాపట్ల ఖండ కార్యవాహ బాలాజి, బాపట్ల ఖండ కళాశాల ప్రముఖ్ పరిమి చరణ్, మండల సంఘ్ ప్రముఖ్ అనంత చక్రవర్తి పాల్గొన్నారు.


రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఉత్సవాలలో పాల్గొన్న సంఘ నాయకులు

నేడు వాల్మీకి జయంతి కార్యక్రమం

బాపట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీభావన్నారాయణస్వామి దేవాలయంలో వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు తెలిపారు. వాల్మీకి జయంతిలో భాగంగా సాయంత్రం 6 గంటలకు నగర సంకీర్తన, సామూహిక హారతి, దీపోత్సవం జరుగుతుందన్నారు. రామభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఏరియా వైద్యశాలలో యువకుడి హల్‌చల్

● పొట్ట కోసుకొని వీరంగం... భయపడిన సిబ్బంది

బాపట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఏరియా వైద్యశాలలో ఆదివారం అర్ధరాత్రి గంజాయి మత్తులో ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థ తెలిపిన వివరాలు ప్రకారం, దినేష్ అనే యువకుడు రాత్రి సమయంలో ఆసుపత్రికి వచ్చి తనకు వైద్య పరీక్షలు చేయాలని సిబ్బందిని కోరాడు. వారు ఓపీ రాయించుకోమని చెప్పగా, గతంలో రాసిన దాని ప్రకారమే తనకు పరీక్షలు చేయాలని సిబ్బందితో వాదనకు దిగాడు. కొంతసేపటి తర్వాత బయటకెళ్ళి మరలా వచ్చి వైద్య సిబ్బందితో గొడవపెట్టుకోవటంతో వారు చేసేదిలేక వైద్యపరీక్షలు చేసి ఆరోగ్యం బాగానే ఉందని చెప్పినప్పటికీ వినకుండా తన పొట్టను తానే కోసుకున్నాడు. అతడి చర్యతో భయభ్రాంతులకు గురైన సిబ్బంది మహిళా వైద్యురాలితోపాటు ఔట్‌పోస్టులోని పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వారొచ్చి అతడికి సర్దిచెప్పి చికిత్స చేయించారు. అతడి గాయానికి ఏడు కుట్లు పడ్డాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థ తెలిపారు. మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతోనే ఆ వ్యక్తి అలా ప్రవర్తించాడని పట్టణ సీఐ ఆర్.రాంబాబు వెల్లడించారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో బాధ్యతతో పని చేయాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్


ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజా సమస్యల వినతిపత్రాలను కలెక్టర్ స్వయంగా స్వీకరించి కొన్నిటికి తక్షణమే పరిష్కారమార్గం చూపించారు. మండలస్థాయిలో పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నూరుశాతం నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ మండలస్థాయి అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే సమస్యలను అధికారులకు ఈఆఫీస్ ద్వారా పంపటం జరుగుతుందని వారు ఆ సమస్యకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పొటోలను ఈఆఫీస్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో గిరిజనులకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వారి కోసం ప్రత్యేకమైన గ్రీవెన్స్ నిర్వహించటం జరుగుతుందని ఆ సమస్యలను గిరిజన సాంఘిక సంక్షేమశాఖాధికారి, ఇన్‌చార్జి పీడీ డీఆర్‌డీఏ సమన్వయం చేసుకొని గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేవిధంగా ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి పాఠశాలలోను, కళాశాలలో సూపర్ జీఎస్‌టి సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, డిబేట్‌లు, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, ఇన్‌చార్జి పీడీ డీఆర్‌డీఏ లవన్న, బాపట్ల ఆర్డీవో గ్లోరియా, జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : ఆర్డీవో

రేపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారవేదికను డివిజన్‌లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికకు ఏడు అర్జీలు అందాయి. పట్టణంలోని దామెర్ల శ్రీనివాసరావు అరవపల్లి గ్రామంలో రీసర్వే చేసి తమ భూమికి సర్వేరాళ్ళు వేశారని, వాటిని గుర్తు తెలియని వ్యక్తులు తీసివేశారని వారిపై చర్యలు తీసుకుని రాళ్ళువేయించాలని కోరారు. మండలంలోని శింగుపాలెంగ్రామానికి వుయ్యూరుసాంబశివరావు తమ పొలాలకు బండ్లబాట మార్గం లేదని పక్క రైతులు అభ్యంతరం పెడుతున్నారని తగు న్యాయం చేయాలని కోరారు. బేతపూడి గ్రామానికి చెందిన కాటూరి శ్రీనివాసరావు ఎన్టీఆర్ విగ్రహం నుంచి తురకపాలెం రహదారి వరకు వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. భట్టిప్రోలు మండలం ఓలేరుగ్రామానికి చెందిన ఓలేటి వీరరాఘవయ్య రజక కులస్థుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీ దాఖలు చేసుకున్నారు. మండలంలోని మోళ్ళగుంట గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు పీతా రవిచంద్ర మోళ్ళగుంట గ్రామంలో డ్రెయినేజీ సౌకర్యం, వైద్యసదుపాయాలు కల్పించాలని కోరారు. మత్స్యకార భరోసా అర్హుల జాబితా గురించి విచారణ జరిపించాలని కోరారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

చెక్‌పోస్టులను ప్రారంభించిన బాపట్ల ఏఎంసీ ఛైర్మన్ కావూరి

బాపట్లరూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటి పరిధిలోని వెదుళ్ళపల్లి, బాపట్ల ప్రధాన కార్యాలయం దగ్గరలో ఉన్న చెక్‌పోస్టులను రోడ్డు విస్తరణ పనుల కొరకు సుమారు 8 సంవత్సరాల క్రితం తొలిగించారు. అప్పటి నుంచి యార్డు సిబ్బంది నానా ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది ఇబ్బందులను తొలిగించటకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు రూ2 లక్షల 50 వేలతో నూతన చెక్‌పోస్టులను ఏర్పాటు చేయగా సోమవారం వాటిని బాపట్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ భూపతిరావు, యార్డు డైరెక్టర్‌లు, యార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్‌పై స్పెషల్ డ్రైవ్

బాపట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ ఆర్.రాంబాబు, ఎస్సై విజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి సోమవారం పట్టణంలో రాంగ్ పార్కింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 3,4 చక్రాల వాహనాలు రాంగ్‌పార్కింగ్ చేయటంపై వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే విధంగా వాహనాలను పార్కింగ్ చేయటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు మార్జిన్‌లో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు పార్కింగ్ చేసిన వారికి జరిమానాలు విధించారు.

కల్తీ మద్యంపై సమగ్ర విచారణ జరపాలి

● ఎంపీ వైవి.సుబ్బారెడ్డి

బాపట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యం తయారీపై కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని రాజ్యసభ సభ్యుడు, వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. బాపట్ల వైసీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ మద్యం పాలసీని రద్దు చేసి కొత్త పాలసీని తీసుకొచ్చిందని అన్నారు. ప్రైవేటు దుకాణాల పేరుతో కూటమి నేతలకు మద్యం దుకాణాలను అప్పగించారని, దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా మద్యం అమ్మకాలు ఇష్టానుసారంగా సమయపాలన లేకుండా జరుగుతున్నాయని ఆరోపించారు. రెండ్రోజుల క్రితం అన్నమయ్య జిల్లా ములకల చెరువు గ్రామంలో కల్తీ మద్యం తయారు చేస్తున్న ఓ గోదాంపై అధికారులు దాడి చేసి సీజ్ చేశారని చెప్పారు. అదేవిధంగా రాష్ట్రంలో కల్తీ మద్యం తయారీ కేంద్రాలను గుర్తించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కల్తీ మద్యం అరికట్టే వరకు వైసీపీ పోరాటం చేస్తుందని సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

పదోన్నతిపై వెళుతున్న ఎలీషాబాబుకు ఘనసన్మానం

పిట్టలవానిపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అంకిత భావంతో ఉద్యోగాన్ని నిర్వహించే ఏ అధికారికయినా సమాజంలో ప్రజల నుంచి ఎనలేని గుర్తింపు దక్కుతుందని పిట్టలవానిపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీహెచ్ శేఖర్ అన్నారు. డిప్యూటీ ఎంపీడీవో స్థాయి నుంచి ఎంపీడీవోగా పదోన్నతి లభించి బదిలీపై వెళుతున్న ఎ.ఏలీషాబాబును మండల పరిషత్ కార్యాలయ అధికారి సీహెచ్ శేఖర్, అక్కడి సిబ్బంది, 14 గ్రామపంచాయతీలకు చెందిన కార్యదర్శులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. నెల్లూరు జిల్లా చేజర్ల మండలానికి బదిలీపై వెళుతున్న ఏలీషాబాబు సేవలను వారు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సురేశ్, ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు ఎ.ప్రసాదరావు, బండ్లమూడి సుజాత, డిప్యూటీ ఎంపీడీవో డి.వెంకట శివకుమార్, డి.పద్మావతి, పి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి సంప్రోక్షణ కార్యక్రమాలు

పిట్టలవానిపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ చెన్నకేశవస్వామివారి దేవస్థానంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు సంప్రోక్షణ కళాన్యాస కార్యక్రమాలు జరుగుతాయని త్రిముఖ దేవాలయాల కార్యనిర్వాహణాధికారి ఘంటసాల నరసింహమూర్తి తెలిపారు. దేవస్థానం ప్రధానార్చకులు శ్రీమాన్ వేదాంతం కృష్ణమాచార్యులు, వేదాంతం వరదాచార్యుల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఈ సమావేశంలో ఆలయ అనువంశిక అర్చక స్వాములతోపాటు పాలక మండలి ఛైర్మన్ యెండూరి సాయి గుప్తా, సభ్యులు గ్రంధి శ్రీనివాసరావు, కరి ప్రసాదశర్మ, బాదుగుల మాధవరావు, కల్లూరి హరికుమారి, పోతర్లంక హేమలత, కత్తి నాగమణి, అద్దెపల్లి ప్రభావతి పాల్గొన్నారు.

ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షుడిగా సాంబయ్య

బాపట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ బాపట్ల క్లబ్ అధ్యక్షుడిగా బొమ్మన బోయిన సాంబయ్య, కార్యదర్శిగా ఐ.శ్రీనివాసరావు, కోశాధికారిగా ఐ.రామారావ నియమితులయ్యారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ బాపట్ల కార్యవర్గ ఎన్నిక సోమవారం కాపుకల్యాణ మండపంలో జరిగింది. కార్యక్రమానికి నేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్లబ్‌లో 20 మంది సభ్యులు చేరారు. అనంతరం హైస్కూల్‌లో విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ నిర్వహించారు.

విద్యార్థులు కీడల్లో రాణించాలి

● కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరి


కార్తిక్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ బుచ్చయ్యచౌదరి

నగరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : నగరం కళాశాల విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించటం అభినందనీయమని కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అన్నారు. సోమవారం శ్రీవెలగపూడిరామకృష్ణస్మారక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత నెల 24వ తేదీ నుంచి ఈనెల 5వ తేదీవరకు కాకినాడలో నిర్వహించిన స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో కళాశాల విద్యార్థి జి.కార్తిక్ 3వ బీసీఏ విద్యార్థి టగ్ ఆఫ్ వార్ ఈవెంట్‌లో గోల్డ్‌మెడల్‌సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ నేషనల్ లెవెల్లో గోల్డ్‌మెడల్ సాధించడం అభినందదాయకమని, కళాశాల పేరును నేషనల్ లెవెల్లో ఇనుమడింప చేశారని ఎన్‌సీసీ క్యాడెట్‌లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ వి.సాంబమూర్తి, కళాశాల సూపరింటెండెంట్ టి.అమరేష్‌రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

డీవీఎంసీ సభ్యునిగా భగవాన్‌దాస్ నియామకం


నియామకపత్రాలు అందుకుంటున్న భగవాన్‌దాస్

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): డీవీఎంసీ సభ్యుడిగా భట్టిప్రోలు మండలం అద్దేపల్లికి చెందిన వేము భగవాన్‌దాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను అద్దేపల్లి అంబేడ్కర్ యూత్ సభ్యులు సోమవారం అభినందనలు తెలియజేశారు. దాస్ విద్యార్థి దశ నుంచే ఎస్ఎఫ్ఐలో విద్యార్థుల, సామాజిక సమస్యలపై బాధ్యతాయుతంగా పనిచేశారన్నారు. దళిత గిరిజన అట్రాసిటి కేసులు, పౌర హక్కుల సంరక్షణ, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి కోసం పనిచేయాలని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, యూత్ సభ్యుడు మనోజ్‌కుమార్ భగవాన్‌దాస్‌ను కోరారు.

రహదారుల దుస్థితిపై ఫిర్యాదు

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహదారుల దుస్థితిపై కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోళ్ల నాగరాజు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మండలంలో ఉన్న ఆర్ అండ్ బీ రహదారుల దుస్థితిని తహసీల్దార్ శ్రీనివాసరావుకు వివరించారు. భట్టిప్రోలు, పెదపులివర్రు, అక్కివారిపాలెం, పెనుమూడికి వెళ్లే రహదారులు పూర్తి అధ్వాన్నంగా తయారయ్యాయని వీటిపై ప్రయాణించడం నరక ప్రాయంగా ఉందని అన్నారు. ఆయా రహదారులకు మరమ్మతులు చేయించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని కోరారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

కొల్లూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కిష్కిందపాలెం గ్రామానికి చెందిన మునిపల్లి రాజేష్ ఆదివారం సాయంత్రం పంట నష్టం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మనస్థాపంతో పురుగు మందు తాగినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించగా రాత్రి పది గంటల సమయంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య సరిత ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. దీనిపై తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లును విచారించగా మృతునికి సొంత భూమి కాని కౌలు భూమిలో గాని వ్యవసాయం చేస్తున్నట్లు తమ విచారణలో వెల్లడి కాలేదని తెలపడం గమనార్హం.

గాయపడిన వ్యక్తి వైద్యశాలకు తరలింపు

కొల్లూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గాయపడిన ఓ వ్యక్తిని స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వైద్యశాలకు తరలించారు. సోమవారం కొల్లూరులోని గాంధీనగర్ సమీపంలో కృష్ణా జిల్లా చర్లపల్లికి చెందిన ఎం.శ్రీనివాస్ అనే వ్యక్తి తలకు గాయమై రోడ్డుపై పడి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు, 108కు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని అంబులెన్స్ సిబ్బంది ఆ వ్యక్తికి ప్రథమ చికిత్స చేశారు. అయితే వైద్యశాలకు తరలించాలంటే క్షతగాత్రునికి సంబంధించిన సహాయకులు ఉండాలంటూ ఆ వ్యక్తిని తీసుకెళ్లేందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. గాయపడిన వ్యక్తిని ఎలా వదిలేసి వెళతారంటూ పాత్రికేయులు అంబులెన్స్ సిబ్బందిని ప్రశ్నించారు. దాంతో వారు ఉన్నతాధికారులకు విషయాన్ని వివరించి పోలీసుల సమక్షంలో క్షతగాత్రుడిని తెనాలి వైద్యశాలకు తరలించారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

బాపట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇస్లాంపేట పరిసర ప్రాంతాలలో కోతుల దాడులతో ప్రజలు భయకంపితులవుతున్నారు. సోమవారం ఓ మహిళపై కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కోతుల బెడదను తప్పించాలని వారు కోరుతున్నారు.


భట్టిప్రోలులో జీఎస్టీ సంస్కరణల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

జీఎస్టీ సంస్కరణలతో కొనుగోలుదారులకు ప్రయోజనం

● ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో కొనుగోలుదారులకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. సోమవారం భట్టిప్రోలులో జరిగిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆనంద బాబు మాట్లాడుతూ, ఎన్డీఏ ప్రభుత్వం మధ్య తరగతి, పేద వర్గాలపై భారాన్ని తగ్గించేందుకు జీఎస్టీ 2.0 పేరుతో సంస్కరణలు చేపట్టిందని, తద్వారా ఒక్కో కుటుంబానికి రూ.15 వేల వరకు ఆదా అవుతుందని అన్నారు. జీఎస్టీ ద్వారా లభించే పన్ను సదుపాయాలు, వ్యాపార సౌలభ్యం, పారదర్శకత, ఆర్థిక లాభాల వంటి అంశాలను సభలో ఎమ్మెల్యే వివరించారు. అనంతరం దుకాణాలు, ఇళ్ల వద్దకు వెళ్లి జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్‌వి రమణ, మండల పార్టీ కన్వీనర్ వాకా శేషుబాబు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ ఊసా రాజేశ్, పీఏసీఎస్ పరుచూరి రమేశ్‌బాబు, యడ్ల జయశీలరావు, డొక్కు శ్రీనివాసరావు, కాట్రగడ్డ నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత


చెక్కులను అందిస్తున్న మంత్రి సోదరుడు అనగానిశివప్రసాద్

రేపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పేద ప్రజలు, వైద్యం చేయించుకోలేని వారికి మంత్రి అనగాని సత్యప్రసాద్ అండగా నిలుస్తున్నారని, వైద్య ఖర్చుల నిమిత్తం నిధులు మంజూరుచేయించి ఆర్థిక భరోసాను కల్పించారని మంత్రి సోదరుడు అనగానిశివప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా నిలవాలనే ఉద్ధేశ్యంతో ముఖ్యమంత్రి సహాయనిధి ఏర్పాటు చేయటం వలన వారిని ఆదుకుంటున్నారన్నారు. 17 మంది పేద ప్రజలకు సీఎం సహాయనిధి కింద రూ.19,73,149 మంజూరు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గామల్లేశ్వరస్వామి ట్రస్టు బోర్డు సభ్యులు జీవీ నాగేశ్వరరావు, నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, గోగినేని పట్టాభిరామారావు పాల్గొన్నారు.

అపరిశుభ్ర వాతావరణంలో రోగాల బారిన పడుతున్నాం

● ఎంపీడీవోకు దళితవాడ వాసుల ఫిర్యాదు

వేమూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : గత కొంత కాలంగా వేమూరు 14వ వార్డు దళితవాడలో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడటం వల్ల నివాసితులంతా రోగాల బారిన పడుతున్నారని, తక్షణ పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానిక నివాసితులు సోమవారం ఎంపీడీవో పి.రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన సర్పంచ్ శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ సుశీల, దళితవాడలో పర్యటించి అక్కడ పరిస్థితులను గమనించారు. తక్షణ చర్యల నిమిత్తం చావలి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిని పర్యవేక్షకుడిగా నియమించారు. ఇన్‌చార్జి కార్యదర్శి నవరాణి తమ సిబ్బంది ద్వారా మురుగు కాల్వల పూడికలు తీయించి దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు. వీధులలో చెత్తా చెదారం తొలగించి మంచినీటి ట్యాంకు పరిశుభ్ర పరచడంతో పాటు లీకేజీ పైపులను సరి చేయించారు. డయేరియా, వైరల్ ఫీవర్లు నియంత్రణ అయ్యే వరకు వైద్యులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా మండల శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వైద్య శిబిరాన్ని కొనసాగించాలని తెలిపారు. వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే ద్వారా అనారోగ్యంగా ఉన్న వారిని గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నారు.


వేమూరు దళితవాడలో పారిశుధ్య చర్యలు పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీలక్ష్మీతిరుపతమ్మ

హిందూ ధర్మరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి

● బాలవికాస్ జిల్లా కన్వీనర్ యల్లాప్రగడ సీతాపతి

నగరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : యుగయుగాల హిందూధర్మం నైతిక విలువలకు కట్టుబడి ఉందని, హిందూ ధర్మరక్షణకు ప్రతి ఒక్క హిందువు కట్టుబడి ఉండాలని బాలవికాస్ జిల్లా కన్వీనర్ యల్లాప్రగడ సీతాపతి అన్నారు. సోమవారం సమరసత సేవాఫౌండేషన్ నగరం మండల కమిటీ సమావేశం బెల్లంవారిపాలెంలో జరిగింది. జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ ఈనెల 7న వాల్మీకి జయంతి, పౌర్ణమి కార్యక్రమాలు దేవాలయాల్లో నిర్వహిస్తూ సామూహిక హారతులు, నగర సంకీర్తనలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ కన్వీనర్ అంకం శివనాగేశ్వరరావు రేపల్లె డివిజన్ ధర్మప్రచారక్ చింతల మురళీకృష్ణ, ఆకిశెట్టి శ్రీనివాసరావు, నిజాంపట్నం నాగేంద్రం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మం సనాతనమైనదని నిత్య నూతనమైనదని జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. యుగయుగాల చరిత్ర కలిగిన హిందూ ధర్మాన్ని మండల కమిటీ సభ్యులు రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. సోమవారం కర్లపాలెం మండల కమిటీ సమావేశం శివాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో హేమశంకరరావు మాట్లాడుతూ మంగళవారం వాల్మీకి జయంతి, పౌర్ణమి సందర్భంగా, దేవాలయాల్లో సామూహిక హారతులు, నగర సంకీర్తనలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నందిపాటి నాగమల్లేశ్వరరావు, సింగారెడ్డి అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటలో కేళీలపై గ్రీవెన్స్‌లో రైతుల ఫిర్యాదు

కొల్లూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో వచ్చిన కేళీలపై సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన రైతులు ఫిర్యాదు చేశారు. కొల్లూరులోని ప్రసాద్ ఏజెన్సీలో ఎన్నారై కంపెనీకి సంబంధించిన బీపీటీ 5204 వరి విత్తనాలను జూన్ 20వ తేదీన తాము కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ రకం సాగు చేసిన రైతుల పొలాల్లో 12 శాతం మేర బెరుకు కారణంగా ఎకరాకు ఐదు క్వింటాళ్ల మేర దిగుబడుల్లో నష్టం వాటిల్లుతోందని రైతులు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి నరేంద్రబాబుకు వివరించారు. దీనిపై స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన

కర్లపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామ సభలో సోమవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై టీడీపీ నాయకుడు మాడా శ్రీనివాసరావు ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన జీఎస్టీ తగ్గింపు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మునిపల్లె చిన్న, గరిగంటి శ్రీనివాసరావు, కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో వ్యవసాయ రంగంలో కొత్త విప్లవం

సీఎం చంద్రబాబు మానస పుత్రిక అయిన క్వాంటం కంప్యూటర్ ద్వారా అందుబాటులోకి రాబోతున్న అత్యాధునిక కృత్రిమ మేధతో వ్యవసాయ రంగంలో కొత్త విప్లవం వస్తుందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీ సత్యనారాయణ అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కృత్రిమ మేధస్సుతోనే వ్యవసాయాన్ని లాభాల బాట పట్టించే అవకాశం ఉన్నప్పటికీ క్వాంటం కంప్యూటింగ్ ద్వారా మరిన్ని అద్భుతాలు సృష్టించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఒక సమస్యకు అనేక పరిష్కారాలు చూపే క్వాంటం కంప్యూటింగ్ ద్వారా నేల సామర్థ్యం అంచనా వేయటంతో పాటు, పంటల ఆరోగ్య విశ్లేషణ, మార్కెటింగ్ అవకాశాలు మెరుగు పర్చుకోవటం వంటివి రైతులకు లాభాలు తెచ్చిపెడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కృత్రిమ మేధస్సు-వ్యవసాయం అనే అంశంపై డాక్టర్ పీవీ సత్యనారాయణ సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

● రోబోటిక్స్, యంత్రీకరణ

కృత్రిమ మేధస్సు ఆధారిత రోబోట్లు పండ్లు, కూరగాయలు వంటి పంటలను పక్వత ఆధారంగా గుర్తించి స్వయంచాలకంగా కోయగలవు. ఇది కూలీల కొరతను అధిగమించడంలో సహాయపడుతుంది. కంప్యూటర్ విజన్‌తో పనిచేసే రోబోట్లు పంట మొక్కలను నాశనం చేయకుండా కలుపు మొక్కలను మాత్రమే గుర్తించి తొలగిస్తాయి, వాటి ఉధృతిని బట్టి కలుపు నియంత్రణ మందులను పిచికారి చేస్తాయి.

● ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

భారతదేశంలో, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతుల కోసం, ప్రభుత్వం కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవసాయ పథకాలను అందిస్తోంది. అయితే చిన్న రైతులకు కృత్రిమ మేధస్సు సాంకేతికతల గురించి అవగాహన కల్పించడం, శిక్షణ ఇవ్వడం, వారికి ఈ సాంకేతికత అందుబాటులో ఉండేలా చూడటం, ఖర్చును తగ్గించడం, సులభంగా వాడే పరిష్కారాలు అభివృద్ధి చేయడం అవసరం. విశ్వసనీయమైన డేటా సేకరణ, పంపిణీ ముఖ్యం. గ్రామీణ ప్రాంతాలలో ఇంటర్నెట్ అనుసంధానం, విద్యుత్ సరఫరా మెరుగుపరచాలని పీవీ సత్యనారాయణ సూచించారు.



● తేలిగ్గా పంట ఆరోగ్య విశ్లేషణ, నేల సామర్థ్యం పరీక్షలు

● వాతావరణం అంచనాతో పంట నష్టం తగ్గింపు

● ఎన్జీ రంగా రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ పీవీ సత్యనారాయణ

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

కృత్రిమ మేధస్సు ఆధారిత డ్రోన్లు, ఉపగ్రహ చిత్రాల ద్వారా పెద్ద వ్యవసాయ క్షేత్రాలను శీఘ్రంగా నిశితంగా పరిశీలించవచ్చు. అల్గారిథమ్‌లో ఈ చిత్రాలను విశ్లేషించి కలుపు మొక్కలు, పోషక లోపాలు, నీటి ఒత్తిడి, తెగుళ్లు, కీటక దాడులను ముందుగా గుర్తించి పంట ఎదుగుదలను, దిగుబడి సామర్థ్యాన్ని అంచనా వేయవచ్చు. రైతులు తమ స్మార్ట్‌ఫోన్‌లలో పంట ఆకులను ఫోటో తీసి మొబైల్‌లోని కృత్రిమ మేధస్సు యాప్‌కు అందించినట్లయితే, ఆ యాప్ తెగుళ్లు, పోషక లోపాలను తక్షణమే గుర్తించి పరిష్కారాలు సూచిస్తుంది. నేలలో అమర్చిన తేమ, ఉష్ణోగ్రత సెన్సార్లు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతికత ద్వారా నేల తేమ స్థాయిని, వాతావరణ పరిస్థితులను అంచనా వేసి మొక్కలకు ఎప్పుడు, ఎంతమేర నీరివ్వాలో నిర్ణయిస్తాయి. నేలకు అవసరమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు ఎంత మోతాదులో ఉపయోగించాలో సూచనలిస్తుంది. గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ తో అనుసంధానించిన ట్రాక్టర్లు, దుక్కి యంత్రాలు, విత్తనాలు నాటే యంత్రాలు స్వయంచాలకంగా పనిచేసి కూలీల ఖర్చును తగ్గిస్తాయి.

● తెగుళ్ళు, కీటకాల నిర్వహణకు, మార్కెట్ వ్యూహాలకు

కృత్రిమ మేధస్సు అల్గారిథమ్లు చారిత్రక డేటా, వాతావరణ పరిస్థితులు, పంట దశలు, ఫీల్డ్ సెన్సార్ డేటాను విశ్లేషించి తెగుళ్లు, కీటక దాడుల ప్రమాదాన్ని ముందుగా అంచనా వేయగలవు. గుర్తించిన ప్రాంతాలకు మాత్రమే సరైన క్రిమి సంహారకాలను పిచికారీ చేయడానికి కృత్రిమ మేధస్సు డ్రోన్లు, స్మార్ట్ స్ప్రేయర్లను ఉపయోగించవచ్చు. అలాగే రైతులు మార్కెట్ వ్యూహాలు, నిల్వ నిర్వహణ రూపకల్పనలో సహాయపడుతుంది. మార్కెట్ ధోరణి, గిరాకీ, సరఫరా సమాచారం, రవాణా ఖర్చులు, గత ధరలను విశ్లేషణ చేసి భవిష్యత్ ధరలను అంచనా వేయగలదు. ఇది రైతులు తమ ఉత్పత్తులను సరైన సమయంలో, మంచి ధరకు అమ్ముకోవడానికి సహాయపడుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ, రవాణా, పంపిణీ వ్యవస్థను మెరుగు పరచి నష్టాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా పంట పండిన తర్వాత దాని నాణ్యతను స్వయంచాలకంగా పరిశీలించి వర్గీకరిస్తుంది. గిరాకీ ఆధారంగా, అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా పంటల సాగుచేయటానికి, నాణ్యతా ప్రమాణాలను పాటించి ఎగుమతులను పెంచుకోవడానికి కూడా కృత్రిమ మేధస్సు ఉపయోగపడుతుంది. అలాగే వాతావరణ డేటాను విశ్లేషించి, వాతావరణ పరిస్థితులను కచ్చితంగా అంచనా వేస్తుంది. కరువు, వరదలు, తుఫానులు వంటి విపత్తుల ప్రమాదాన్ని ముందస్తుగా అంచనా వేసి రైతులు నష్టాన్ని తగ్గించుకోవడానికి తగిన చర్యలు తీసుకోవడానికి సహాయపడుతుంది.

మిర్చియార్డులో భారీఎత్తున అభివృద్ధి పనులు

● రూ. 3.20 కోట్లతో మార్కెటింగ్ శాఖకు ప్రతిపాదన

● రాబోయే సీజన్‌లోపు పూర్తి చేయాలని లక్ష్యం

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే ఖ్యాతి గాంచిన మిర్చియార్డులో రైతులు, వ్యాపారస్థులు, హమాలీల సౌకర్యార్థం భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికార యంత్రాంగం నిర్ణయించింది. మరో రెండు, మూడు నెలల్లో మిర్చి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పది పనుల అంచనాలను మార్కెటింగ్‌శాఖ అధికారులు కమిషనర్‌కు నివేదించారు. ఇటీవలి కాలంలో ఎప్పుడూ లేని విధంగా దాదాపుగా రూ. 3.20 కోట్ల పనులను చేపట్టబోతున్నారు. వీటికి పరిపాలన అనుమతి రాగానే సాంకేతిక అనుమతులు తీసుకొని సాధ్యమైనంత త్వరగా పనులు చేపట్టి పూర్తి చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు.

వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో మిర్చియార్డులో పెద్దగా అభివృద్ధి పనులు జరగలేదు. దీంతో డ్రైనేజీ సమస్యలు పెరిగిపోయాయి. పైపులైన్ల లీకులు వంటివి తరచుగా జరుగుతున్నాయి. టాయ్‌లెట్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. రైతులు విశ్రాంతి తీసుకొనే రెస్టుహౌస్ లోనూ సరిగా సదుపాయాలు ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే ప్రతిస్పందించేందుకు అవసరమైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కూడా అందుబాటులో లేదు. వీటన్నింటికి సంబంధించి మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చేత అధ్యయనం చేయించి ప్రతిపాదనలు సిద్ధం చేయించారు.



మిర్చియార్డు

ప్రతిపాదనలు ఇలా...

- రూ. 33 లక్షలతో ర్యాంపులను సరి చేయడం, కల్వర్టులపై మ్యాన్ హోల్స్ ఏర్పాటు, 2, 3 గేట్ల వద్ద బెల్‌మౌత్‌ల ఏర్పాటుకు ప్రతిపాదన.
- ప్రస్తుతం ఉన్న డ్రెయిన్లపై ప్రీకాస్టు బ్లాకుల ఏర్పాటుకు రూ 28 లక్షలతో పనుల ప్రతిపాదన.
- రూ. 22.50 లక్షలతో సూపర్‌వైజర్ల హాల్‌లో వర్కుస్టేషన్ల ఏర్పాటు.
- పాత మిర్చియార్డులో ఉన్న అతిథిగృహం మరమ్మతులనురూ.21 లక్షలతో ప్రతిపాదన.
- వేస్టువాటర్ పైపులైనుని అన్ని టాయ్‌లెట్స్, యూరినల్ బ్లాకులకు విస్తరించేందుకు రూ. 37 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా.
- ఫైర్ ఫైటింగ్ పరికరాల రిపేర్లు, గ్రిల్స్ ఎత్తు పెంచడం, రెండు మోటార్లను లింకు చేసేందుకు రూ.20లక్షలతో పనులకు ప్రతిపాదన.
- 6, 7 గేట్ల వద్ద సీసీ డ్రెయిన్ల విస్తరణ, సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ. 29.80 లక్షలతో ప్రతిపాదన.
- రైతు విశ్రాంతి గది నుంచి ఉచిత భోజన శాల వరకు ప్రహరీ గోడ నిర్మాణానికి రూ. 14.50 లక్షల ఖర్చవుతుందని అంచనా.
- వాటర్ ట్యాంకు ఏరియా చదును చేయడం, జనరేటర్ రూం వద్ద పార్కింగ్ టైల్స్ ఏర్పాటుకు రూ. 12.30 లక్షలతో పనులకు ప్రతిపాదన.
- టీటీపీసీ భవనం రిపేర్లు, నిర్వహణకు రూ. 1.02 కోట్ల ఖర్చవుతుందని అంచనా.

రైతు ప్రయోజనాల కోసమే పనుల ప్రతిపాదన

● చంద్రిక, జీఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి



మిర్చి సీజన్ డిసెంబరు నెలాఖరు నుంచి ప్రారంభమవుతుంది. అప్పుడు నిత్యం వేల సంఖ్యలో రైతులు మిర్చియార్డుకు వచ్చే అవకాశం ఉన్నందున వారి ప్రయోజనాల కోసమే మౌలిక సదుపాయాల కల్పన పనులకు ప్రతిపాదించాం. మిర్చియార్డుకు వచ్చిన రైతు ఎక్కడా అసౌకర్యానికి గురి కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే సీఎం ఆదేశాల మేరకు అనేక పనులు చేపట్టాం. ఈ-పోస్ యంత్రాల ద్వారా మిర్చి టిక్కీల కాటాలు పకడ్బందీగా జరిగేలా చూస్తున్నాం. ప్రతిపాదన పనులు పూర్తయితే మౌలిక సదుపాయాలకు ఎక్కడా ఇబ్బంది తలెత్తదు.

రిజర్వుడు బోగీల్లోకి జనరల్ టిక్కెట్ ప్రయాణికులు

● టార్గెట్ల కోసం ఫైన్లు రాస్తున్న టీసీలు ● ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోని ఆర్‌పీఎఫ్ సిబ్బంది ● ఇబ్బందులు పడుతున్న కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్ ప్యాసింజర్లు

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గతంలో రిజర్వేషన్ టిక్కెట్ లేకుండా రైళ్లలోని రిజర్వుడు బోగీలలోకి కాలు మోపే పరిస్థితి ఉండేది కాదు. ఇప్పుడు జనరల్ టిక్కెట్‌తోనే కాకుండా అసలు ఎలాంటి టిక్కెట్ లేకుండానే స్లీపర్‌క్లాస్ బోగీలలోకి కొందరు ప్రయాణికులు ఎక్కేస్తున్నారు. వీళ్ల వల్ల మహిళలు బిక్కుబిక్కుమంటూ రాత్రంతా నిద్రకు దూరమై ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక టాయ్‌లెట్స్ వద్దకు కూడా వెళ్లలేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్లీపర్‌క్లాస్ బెర్తుల మధ్యన అన్ రిజర్వుడు ప్రయాణికులు చేరి కూర్చోవడం, నిద్రపోవడం వంటివి చేస్తుండటంతో బెర్తులలో ఉన్న కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్ ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పండగల రద్దీ రోజుల్లో అయితే కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్‌లు ఉన్న ప్రయాణికులు కనీసం వాళ్ల సీట్లలో కూడా కూర్చోలేని పరిస్థితి రైళ్లలో తలెత్తుతోంది. ఈ పరిస్థితిపై ఆన్‌బోర్డు టీసీలకు ప్రయాణికులు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. మరోవైపు ఆర్‌పీఎఫ్ గార్డులు కూడా చూసి చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో ముఖ్యంగా స్లీపర్‌క్లాస్ ప్రయాణం ఇటీవలి కాలంలో ప్రయాణికులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తోంది. ఈ క్రమంలో అక్కడి నుంచి వెళ్లిపోవాలని ప్రయాణికులు ఎవరైనా కోరితే అందుకు ఎదురు సమాధానాలు చెబుతూ గొడవలకు దిగుతున్నారు. రైల్వే శాఖ ఈ పరిస్థితిని నిలువరించకపోతే భవిష్యత్తులో రైలు ప్రయాణమంటేనే మహిళలు భయపడిపోయే పరిస్థితి నెలకొంటుంది.

రైల్వే చట్టం ప్రకారం కన్‌ఫర్మ్‌డ్, పార్షియల్ కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్ ప్రయాణికులను మాత్రమే రిజర్వుడు బోగీలలోకి అనుమతించాలి. ఏవైనా బెర్తులు ఖాళీ ఉన్నప్పుడు మాత్రమే జనరల్ టిక్కెట్ ప్రయాణికులకు ఫైన్ చెల్లించుకొని బెర్తు నంబరు కేటాయించాలి. ఆ ప్రయాణికుడి పూర్తి వివరాలు కూడా నమోదు చేసుకోవాలి. ఈ నిబంధనలను ఆన్‌బోర్డు టీసీలు పాటించడం లేదు. కేవలం తమకు కేటాయించిన ఫైన్‌ల లక్ష్యాన్ని అధిగమించేందుకు జనరల్ టిక్కెట్‌తో లేదా టిక్కెట్ లేకపోయినా సరే ఫైన్ రాసేసి ఇష్టం వచ్చినచోట కూర్చోమని అనుమతిస్తున్నారు. ఇలా చేయడాన్ని ఆర్‌పీఎఫ్ సిబ్బంది నిరోధించాలి. వాళ్లు కూడా చేతులు కట్టుకోవటంతో ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల దసరా పండగ సమయంలో గుంటూరు మీదుగా ప్రయాణించిన అన్ని ఎక్స్‌ప్రెస్/సూపర్‌ఫాస్టు రైళ్లలో ప్రయాణికులు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఉత్తరాది, పశ్చిమ రాష్ట్రాల నుంచి వచ్చే రైళ్లలో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉందని ప్రయాణికులు తెలిపారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా అమృత్ సంవాద్ పేరుతో రైల్వే అధికారులు ప్రయాణికుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. అయితే వాటిని ఆచరణలో పెడతారా, లేదా అన్నదే అనుమానంగా మారింది.

కలవరపెడుతున్న టూరెట్ సిండ్రోమ్..!

● చిన్న పిల్లలను వేధిస్తున్న వింత వ్యాధి
● కొవిడ్ తర్వాత పెరుగుతున్న బాధితులు
● బిహేవియర్ థెరపీతో పరిష్కార మార్గాలు


గుంటూరు మెడికల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పిల్లలు కన్ను గీటడం, ముక్కు ఎగబీల్చడం, గొంతు సవరించుకోవడం, అశ్లీల పదాలు వాడటం మామూలే. ఈ లక్షణాల సమూహారాన్ని సాధారణంగా టూరెట్ సిండ్రోమ్ అంటారు. పైన పేర్కొన్న లక్షణాలు సాధారణ లక్షణాలుగానే కనిపిస్తాయి. అయితే ఇవి సింగిల్ టిక్స్ (ఒకరిలో ఒకే లక్షణం)గా ఉంటే వింత అనిపించదు. కాని మల్టిపుల్ టిక్స్ (అన్నీ ఒకరి లోనే కనిపిస్తే) ఉన్నవారిలో మాత్రం టూలెట్ సిండ్రోమ్ పెద్ద సమస్యగా మారుతుంది. ఈ వ్యాధి ఉన్న వారికి సామాజికంగా వివక్ష ఎదుర వుతుంది. గుంటూరు నగరంలో న్యూరాలజిస్టుల దగ్గరకు ఇటీవల పెద్ద సంఖ్యలో టూరెట్ బాధిత చిన్నారులు చికిత్సకు వస్తున్నారు.

చిన్న పిల్లల్లో కనిపించే వ్యాధి

టూరెట్ సిండ్రోమ్ సాధారంగా చిన్నపిల్లల్లో కనిపిస్తుంది. వ్యాధిగ్రస్థుల్లో 80 శాతం మంది మగ పిల్లలే ఉంటారు. టూరెట్ జన్యు వ్యాధి. మెదడులోని బేసల్ గ్యాంగ్లియా, థలామస్, కార్టెక్స్ మధ్య న్యూరో నెట్‌వర్క్ సమన్వయం కొరవడటం వల్ల సంక్రమిస్తుంది. కొవిడ్-19 తర్వాత టూరెట్ సిండ్రోమ్ కేసులు పెరుగు తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. పిల్లల్లో వ్యాధిని సకాలంలో గుర్తించడం ముఖ్యం. తల్లిదండ్రులు తమ పిల్లల్లో ఇదొక ప్రవర్తనాపరమైన సమస్య గా భావిస్తున్నారు తప్పితే టూరెట్ సిండ్రోమ్‌గా గుర్తించలేకపోతున్నారు. ఇది తర్వాత పలు సమస్యలకు దారి తీస్తోంది.

మల్టీపుల్ టిక్స్‌తో ఇబ్బందులు

టూరెట్ సిండ్రోమ్ బారిన పడ్డ పిల్లలు పదే పదే నోటితో శబ్దాలు చేయడం, కన్ను కొట్టడం, గొంతు సవరించుకోవడం, అశ్లీల పదాలు ఉచ్చరించడం వంటివి చేస్తారు. వీటిని టిక్స్‌గా పిలుస్తారు. మల్టీపుల్ టిక్స్‌తో పిల్లలకు ఇబ్బందులు ఎదురవుతాయి. కొందరిలో ఇవి స్వల్పంగా ఉంటే మరి కొందరిలో తీవ్రంగా ఉంటాయి. ఈ లక్షణాలు తరచూ కనిపిస్తుంటాయి. ఇలాంటి వారి పట్ల బడిలో, బయట వివక్ష కనిపిస్తుంది. చదువులోనూ వెనుకబడతారు. టూరెట్ రోగులకు ప్రత్యేక వైద్యం అంటూ ఏమీ లేదు. లక్షణాలు తగ్గించేందుకు మందులు వాడతారు. కొందరిలో టూరెట్ లక్షణాలతో పాటు ఏడీహెచ్‌డీ, ఓసీడీ వంటి లక్షణాలు కలసి ఉంటాయి.



ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదే కీలక పాత్ర

● న్యూరాలజిస్ట్ డాక్టర్ ఘంటా శ్రీనివాస్

టూరెట్ బాధిత చిన్నారుల చికిత్సల్లో వైద్యుల కన్నా.. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాత్ర కీలకమని న్యూరాలజిస్ట్ డాక్టర్ ఘంటా శ్రీనివాస్ తెలిపారు. టిక్స్‌తో బాధపడే పిల్లల పట్ల వివక్ష చూపకుండా ఓర్పుగా వ్యవహరించి వారి పట్ల ఆదరణ చూపాలన్నారు. వీరి పట్ల టీచర్లు, తల్లిదండ్రులు కోప్పడితే... వారు మరింత ఆందోళన చెంది లక్షణాల తీవ్రత పెరుగుతుందన్నారు. ఇలాంటి వారికి కాగ్నేటివ్ బిహేవియర్ థెరపీ, కౌన్సెలింగ్ వల్ల కొంత ఉపయోగం ఉంటుందన్నారు.



రెగ్యులేటరీ సంస్థల సలహాలతో ఆర్థిక మోసాల కట్టడి

● ఏఎన్‌యూ రెక్టార్ శివరాం ప్రసాద్

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మోసాలను అడ్డుకునేందుకు రెగ్యులేటరీ సంస్థల సలహాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ ఆర్ శివరాం ప్రసాద్ అన్నారు. సోమవారం ధర్మపీఠం లీగల్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అభిజ్ఞ భారత్ ఆర్గనైజేషన్, హిందూ కాలేజ్ ఆఫ్ మేనేజ్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో హిందూ కళాశాలలో సెక్యూర్డ్ ఫైనాన్షియల్ ప్లానింగ్ అండ్ ఫ్రాడ్ ప్రివెన్షన్ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి హిందూ కాలేజ్ ఆఫ్ మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ రమణ అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో రెక్టార్ శివరాం ప్రసాద్ మాట్లాడుతూ, తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనుకునేవారు, అధిక ఆత్మవిశ్వాసంతో కొందరు ఆర్థిక నష్టాలను చవిచూస్తారని అన్నారు. ఆర్థిక మోసాలను అడ్డుకునేందుకు రెగ్యులేటరీ సంస్థల సలహాలు తీసుకోవాలని సూచించారు. అభిజ్ఞ భారత్ ఆర్గనైజేషన్ ఫౌండింగ్ ఛైర్మన్ డాక్టర్ దుంప శ్రీదేవి మాట్లాడుతూ, సెబీ, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రతినిధులు విద్యార్థుల చెంతకు వచ్చి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ధర్మపీఠం లీగల్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, మోసాల బారిన పడి కొందరు చిన్న వయసులోనే ఆత్మహత్యలు చేసుకుంటున్న ఉదంతాలు చూస్తున్నామని చెప్పారు. సెబీ సౌత్ ఇండియా జనరల్ మేనేజర్ ఎంకే శ్రీకాంత్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ గుంటూరు రవి రాజా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు పెట్టుబడి సంస్థలలో మోసాలకు గురికాకుండా ఎలా ఉండాలో సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ చెరువు రామకృష్ణ మూర్తి, శెట్టిపల్లి శశికిరణ్, సంపతి సంతోష్ కుమార్, యర్రం శెట్టి శ్రీనివాసరావు, కుమారి తాళ్లూరి ప్రహర్షిత, కళాశాల విభాగాధిపతి అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ వి చక్రవర్తి, ప్రొఫెసర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. కల్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వైష్ణవి, వేదవతి, బాజీ బాబు, అభిలాష్ రెడ్డి, షబానా, అనిత, వెంకట కల్యాణ్, రాజేశ్వరి దేవి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రెక్టార్ శివరాం ప్రసాద్

అమరావతిలో ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం పర్యటన

తుళ్లూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) బృందం సోమవారం రాజధాని అమరావతి పర్యటనకు విచ్చేసింది. ఏడీబీ - వాటర్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సెక్టార్ బృందంలోని సభ్యులైన నోరియా సైటో (సీనియర్ డైరెక్టర్), మనోజ్ శర్మ (డైరెక్టర్), సంజయ్ జోషి (ప్రిన్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు), అశ్విన్ హోసూర్ విశ్వనాథ్ (సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్) తొలుత విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చారు. ఏడీబీ బృందానికి సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు, అదనపు కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్, అమిలినేని భార్గవ్‌తేజ్ స్వాగతం పలికారు. అనంతరం సీఆర్‌డీఏ, అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్)లోని ముఖ్య అధికారులతో బ్యాంకు బృందం సమావేశం కాగా రాజధాని అమరావతి నిర్మాణ పురోగతిని కమిషనర్ వివరించారు. అనంతరం బ్యాంకు బృందం మందడంలోని సీఆర్‌డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం, శాఖమూరు రిజర్వాయర్, నిర్మాణం పూర్తి చేసుకొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవనాల సముదాయాలు ఇతర భవనాలను పరిశీలించింది. ఆయా సైట్లలో సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు నిర్మాణ పనుల పురోగతిని వివరించారు. మందడంలో అమలుచేస్తున్న గ్రీవెన్స్ రిడ్రస్సల్ మెకానిజం (జీఆర్‌ఎం) గురించి అధికారులు బ్యాంకు బృందానికి వివరించారు. అర్జీల పరిష్కారంలో అమలవుతున్న జీఆర్‌ఎం విధానం పై బ్యాంకు బృందంలోని సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం శాఖమూరు రిజర్వాయర్ వద్ద ఏడీసీఎల్ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ (పీఎంసీ), గుత్తేదారులతో బ్యాంకు బృందంలోని సభ్యులు కలిశారు.



అమరావతిలో పర్యటించిన ఆసియా అభివృద్ధి బ్యాంకు సభ్యులు

రేషన్ బియ్యం పట్టివేత

పొన్నలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మండలంలోని ముప్పాళ్ల అడ్డరోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 4వ తేదీ తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో పొన్నలూరు మండలం కనిగిరి నుంచి కందుకూరు వైపు వెళుతున్న మినీ ట్రక్కును పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అందులో 20 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించారు. బియ్యాన్ని ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులకు అప్పగించగా, వారు దర్యాప్తు చేసి రేషన్ బియ్యంగా నిర్ధారించారని ఎస్‌ఐ అనుక్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

దొంగతనం కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

ఒంగోలు క్రైం,అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్ దొంగిలించిన కేసులో మూటా నవీన్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి ఎస్.కోమలివల్లి సోమవారం తీర్పు చెప్పారు. సంతనూతలపాడులో 2022 ఆగస్టు 14 రాత్రి రోడ్డు పక్కన పార్కు చేసి మందాడి సత్యనారాయణ నిద్రపోయాడు. దీంతో గుర్తుతెలయని వ్యక్తులు మోటార్ సైకిల్‌ను దొంగిలించారు. ఈమేరకు సత్యనారాయణ సంతనూతలపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశా రు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా ఒంగోలు జయప్రకాష్ కాలనీలో నివాసం ఉండే మూటా నవీన్ మోటార్ సైకిల్ దొంగిలించినట్లు గుర్తించారు. అతనివద్ద మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసి కోర్టులో పోలీసులు చార్జీషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్రావణకుమార్ తమవాదనలు వినిపించారు.నవీన్‌పై దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో న్యాయాధికారి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

సీపీవోగా సుధాకర్‌రెడ్డి



సుధాకర్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అర్థికగణాంక అధికారి(సీపీవో)గా సుధాకర్‌రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ సిటీస్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై జిల్లాకు వచ్చారు. సీపీవోగా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్‌రెడ్డిని ఆ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

లోగ్రేడ్ పొగాకు కిలో రూ.69

- లబోదిబోమంటున్న రైతులు

ఒంగోలు(రూరల్), అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పొగాకు వేలం కేంద్రం రెండులో సోమవారం జరిగిన వేలంలో లోగ్రేడ్ పొగాకు కిలో కనిష్ఠ ధర రూ.69కి వ్యాపారులు కొనుగోలు చేశారు. నాణ్యమైన పొగాకును కిలో గరిష్ఠ ధర రూ. 315కు వ్యాపారులు కొనుగోలు చేశారు. రైతులు వద్ద గల లోగ్రేడ్ పొగాకును వేలంకు 80శాతం పైగా తీసుకురాగా ఇదే అదునుగా భావించిన పొగాకు వ్యాపారులు వేలంలో సిండికేట్ అయి అతి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. దీంతో పొగాకు రైతులు ఏమి చేయాలో అర్థం కాని స్థితిలో ఉన్నారు. సోమవారం వేలంకు మొత్తం 1,510బేళ్ల రాగా 1,318 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు.130 బేళ్ల నోబిడ్ అయ్యాయి.

ఎదురొచ్చిన మృత్యువు

- 108 వాహనం ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం



లక్ష్మయ్య మృతదేహం

పెద్దారవీడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆప దలో ఉన్న వారిని కాపాడేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన సోమవారం మండలంలోని ఎస్.కొత్తపల్లి పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దోర్నాల మండలం రామచంద్రకోటకు చెందిన బొమ్మనబోయిన కొండలరాజు (18), ధనంకుల లక్ష్మీనారాయణ (23) సొంత పనుల నిమిత్తం మోటార్ సైకిల్‌పై సోమవారం ఉదయం మార్కాపురం వచ్చారు. పనులు ముగించుకొని తిరిగి రామచంద్రకోటకు బయల్దేరారు. పెద్దారవీడు, ఎస్.కొత్తపల్లి మధ్య మూలమలుపులో వారి బైక్‌ను ఎదురుగా వస్తున్న 108 వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. ఎస్ఐ సాంబశివయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



కొండల రాజు మృతదేహం

శనగలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి

క్వింటాకు రూ.10 వేలు ఇవ్వకుంటే ప్రభుత్వమే రూ.3వేలు బోనస్ ప్రకటించాలి

దేశీయపంటల ఎగుమతులపై నిషేధాజ్ఞలు ఎత్తివేయాలి



ధర్నా చేస్తున్న రైతు సంఘ నేతలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : శనగ పంటకు క్వింటాకు రూ.10వేలు గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో క్వింటాకు రూ.3వేలు బోనస్ ప్రకటించాలన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు ఏపీ రైతు సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి అధ్యక్షత వహించారు. ధర్నాలో మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ రెండేళ్లుగా శనగ పంటకు గిట్టుబాటు ధరలు లేక కోల్డ్ స్టోరేజీల్లో 91వేల టన్నులు నిల్వ ఉన్నాయన్నారు. గత ఏడాది రూ.10వేల వరకు ధరలు కలిగినా కొనుగోలు మాత్రం నామమాత్రంగానే జరిగాయని చెప్పారు. క్వింటా పంట ఉత్పత్తి ఖర్చు రూ.7వేలపైనే ఉందన్నారు. క్వింటా శనగలు రూ.10వేలకు అమ్ముకుంటేనే కౌలు రైతు పరిస్థితి ఒక రకంగా ఉంటుందని తెలిపారు. ధరలు లేకపోవడంతో రైతులు రోడ్డునపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జే జయంతిబాబు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎగుమతి, దిగుమతి విధానం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎగుమతులపై నిషేధాజ్ఞలు ఎత్తివేయాలని కోరారు. రాష్ట్రంలో ఒక దశ, దిశలేకుండా పాలన సాగుతోందని విమర్శించారు. రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ ఈ ఏడాది బర్లీ రైతులు, వర్జీనియా పొగాకు రైతులు, శనగ, మిర్చిరైతులకు గిట్టుబాటు ధరలు లభించని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏ పంటకు సరైన ధరలు లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అనంతరం కలెక్టర్ రాజాబాబును కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో రైతు కూలీ సంఘం ఉపాధ్యక్షుడు పరిటాల కోటేశ్వరరావు, పలు రైతు సంఘాల నాయకులు, రైతులు ఉన్నారు.

సంతలకు ఆదరణ అదరహో



కూరగాయలు కొంటున్న మహిళలు

ఒంగోలు కల్చరల్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి) : పాత రోజుల్లో అనేక గ్రామాలలో, పట్టణాలలో వారానికో రోజు సంత జరుగుతుండేది. ఆ రోజు వివిధ ప్రదేశాల నుంచి నిత్యావసరాలు, రైతులు తమ పొలాల్లో పండిన కూరగాయలు తెచ్చి సంతలో అమ్ముతుండేవారు. ప్రజలు సంతకు వెళ్లి వారానికి సరిపడా కూరగాయలు కొనే వారు. ఇప్పుడు ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని కొన్ని పట్టణాలలో ఇదే తరహాలో సంతలునడుస్తున్నాయి. పల్లెటూళ్ల నుంచి వివిధ రకాల కూరగాయలను మినీ ట్రక్కులలో తెచ్చి వారానికి ఒక రోజు లేదా రెండు రోజులు అమ్మకాలు సాగిస్తున్నారు. చాలామంది ఒకే ప్రదేశంలో వారు ఎంచుకున్న రోజులలో కూరగాయల అమ్మకాలు సాగిస్తున్నారు. ఉదాహరణకు ఒక ప్రాంతంలో సోమ, శుక్రవారం సాయంత్ర సమయాలలో ఈ విధమైన అమ్మకాలు ఉంటాయి. ఇక్కడ మరొక విశేషం ఏమిటంటే ఏ రకం కూరగాయలైన ఒకే ధరకు విక్రయిస్తున్నారు. అదే మార్కెట్‌కు లేదా రైతుబజార్‌కు వెళితే ఒక్కో రకం కూరగాయలకు ఒక్కో ధర ఉంటుంది. ప్రస్తుతం ఇలా రోడ్డు పక్కన అమ్మకాలు సాగించేవారు ఏ రకమైనా కిలోకి ఒకే ధర నిర్ణయిస్తారు. కావలసిన కూరగాయలన్నింటినీ ఆ కవర్లో వేసుకుని తూకం పెడతారు. ఎన్ని కిలోలు ఉంటే ఆ రోజు ధరను బట్టి డబ్బులు చెల్లించటమే. ఒంగోలు నగరంలో దక్షిణ బైపాస్, ఉత్తర బైపాస్, మామిడిపాలెం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు చుట్టుపక్కల ఇటువంటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇక సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే మహిళలు సైతం ఇంటికి వెళ్లేటప్పుడు వీటిని కొని తీసుకు వెళ్తున్నారు. ఇలా విక్రయాలు చేసేవారికి షాపుల అద్దెలు, కరెంటు బిల్లులు లేకపోవటంతో వారు మార్కెట్, రైతుబజార్ కన్నా తక్కువ ధరకు ఇస్తున్నారు.

బాగుపడే 'దారేదీ'

- కొండపి నుంచి అనకర్లపూడి వరకు రోడ్డు అధ్వానం
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- వాహనదారులకు అవస్థలు



అధ్వానంగా కొండపి నుంచి అనకర్లపూడి రోడ్డు



అట్లేరు నుంచి అనకర్లపూడి వరకు గోతులమయమైన రోడ్డు

కొండపి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొండపి నుంచి మద్దులూరు వెళ్లే రోడ్డు నరకప్రాయంగా మారింది. గోతులమయం కావడంతో ప్రయాణానికి ఇబ్బంది ఏర్పడింది. ముఖ్యంగా కొండపి నుంచి అనకర్లపూడి వరకు మూడు కిలోమీటర్లు రోడ్డులో వెళ్లాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. తారురోడ్డు పూర్తిగా దెబ్బతినడంతోపాటు మార్జిన్లు కూడా గోతులమయమై ఎదురెదురు వాహనాలు ఎటువెళ్లాలో తెలియని దుస్థితి. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

అట్లేరు నుంచి అనకర్లపూడి వరకు మరీ దారుణం

అలాగే అట్లేరు నుంచి అనకర్లపూడి వరకు 2 కి.మీ రోడ్డు మరింత అధ్వానంగా మారింది. ఈరోడ్డులో చీమకుర్తి ప్రాంతం నుంచి భారీ వాహనాలు నిత్యం తిరుగుతున్నాయి. ఆ వాహనదారులు తమ సౌకర్యం కోసం.. దెబ్బతిన్న రోడ్డ మార్జిన్లు దొరికిన మట్టిని పోసి గోతులు పూడ్చారు. ఆ మట్టి వర్షాలకు బురదగా మారింది. వాహనాల టైర్ల తిరుగుతుండడంతో రోడ్డుపై గాడులు పడి, వాహనదారులకు మరింత అసౌకర్యం కలిగిస్తున్నాయి. ప్రధానంగా భారీ వాహనం ఎదురు వచ్చినపుడు మార్జిన్ దిగిన మోటార్‌సైకిల్ టైర్లకు మట్టి చుట్టుకుపోయి పడిపోతున్నారు. నెలరోజుల కిందట ఓ ద్విచక్ర వాహనదారుడు బస్సు కన్నా ముందుకు వెళ్లాలని మార్జిన్‌లోకి దిగి తిరిగి రోడ్డు ఎక్కబోయి అదుపు తప్పి బస్సుకింద పడిపోయి ప్రాణాలు విడిచాడు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈరోడ్డులోని గ్రామాల ప్రజలు ప్రయాణిస్తూ అవస్థలు పడుతున్నారు. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్వచ్ఛ సమాజ సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ఘనంగా స్వచ్ఛ పురస్కారాల ప్రదానోత్సవం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు, వేదికపై ఎమ్మెల్యే దామచర్ల, ఒడా చైర్మన్ రియాజ్, మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతను జీవన విధానంగా సమాజం మార్చుకునేందుకు ఉద్యమ స్థాయిలో ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ పి.రాజాబాబు పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం ఒంగోలులోని జీజీహెచ్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ప్రదానం చేస్తోందన్నారు. అదే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ అవార్డులను అందజేస్తుందని చెప్పారు. ఈ క్రమంలో జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మూడు, జిల్లా స్థాయిలో 49 అవార్డులు లభించాయన్నారు. సింగపూర్ ప్రసిద్ధి చెందడానికి స్వచ్ఛతే ప్రధాన కారణమని కలెక్టర్ చెప్పారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్వచ్ఛతపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్రలో ఈ వేస్‌లో ఒంగోలు కార్పొరేషన్‌కు ఇటీవల అవార్డు లభించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ స్వచ్ఛత ఆవశ్యకతను తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ మన ఇంటితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు కంకణబద్దులు కావాలన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ స్వచ్ఛత, పరిశుభ్రత, మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛతతో పరిసరాల పరిశుభ్రతతోపాటు ఆరోగ్యం, కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడుతుందన్నారు. అనంతరం అవార్డులు పొందిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత, స్వర్ణాంధ్ర ఆవిష్కరణపై నగర కమిషనర్ కే వెంకటేశ్వరరావు రచించిన గీతాన్ని గాయకుడు నూకతోటి శరత్‌బాబు స్వర కల్పన చేసి ఆలపించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో పురస్కారాల ప్రదానోత్స కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై వీక్షించారు. కార్యక్రమంలో ఒడా చైర్మన్ షేక్ రియాజ్, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకటత్రివినాగ్, డీఆర్వో చిన ఓబులేశ్, డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అమరావతిపై పాట ఆవిష్కరణ

రాజధాని అమరావతిపై నగర కమిషనర్ కే వెంకటేశ్వరరావు రచించిన పాటను కలెక్టర్ పి. రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాత ఆవిష్కరించారు. గాయకులు నూకతోటి శరత్ ఆలపించగా, కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర, అమరావతి రాజధానిపై రచించిన గీతాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అంకితమిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఈ-క్రాప్ నమోదుకు గడువు పెంపు

- ఈ నెల 25 వరకు అవకాశం
- 30లోపు ఆర్ఎస్‌కేలలో జాబితాలు
- ఇప్పటివరకు 48.98శాతం నమోదు
- అత్యధికంగా మద్దిపాడులో 80 శాతం
- పలు మండలాల్లో వెనుకబాటు



ముండ్లమూరులో ఈ-పంట నమోదు పరిశీలిస్తున్న డీఏవో(ఫైల్)

ఒంగోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ఈ-క్రాప్ నమోదుకు ప్రభుత్వం గడువు పొడిగించింది. తొలుత ఖరీఫ్ సీజన్ ముగిసే సెప్టెంబరు 30 వరకే గడువు ఇచ్చింది. అయితే సగం విస్తీర్ణం వివరాలు కూడా నమోదు కాలేదు, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే ఉండటంతో ఈనెల 25 వరకు గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వపరంగా రైతులకు ఇచ్చే రాయితీలు, ఇతరత్రా అన్ని విషయాల్లోనూ ఈక్రాప్ నమోదు ప్రధానమైనదన్న విషయం విదితమే. గతంలో కేవలం పంటల సాగు విస్తీర్ణాన్ని మాత్రమే ఈ క్రాప్ నమోదు చేసేవారు. ఈ ఏడాది నుంచి పంటలు సాగు జరిగినా, లేకపోయినా.. ప్రభుత్వ, బీడు భూములు అయినా ఒక్క ఫారెస్టు భూమి మినహా సర్వే నంబరు కేటాయించిన అన్నిరకాలను ఈ పంట నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నమోదు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లాలో వెబ్‌ల్యాండ్ ప్రకారం మొత్తం 15,36,444 ఎకరాల భూమి ఈ-పంటలో నమోదు చేయాల్సి ఉంది. ఆ మేరకు ప్రభుత్వం నుంచే మండలాల వారీ భూవిస్తీర్ణం వివరాలు వ్యవసాయ శాఖకు అందాయి. అందులో ఇప్పటివరకు 7,40,416 ఎకరాల (48.98శాతం) విస్తీర్ణం వివరాలను అధికారులు నమోదు చేశారు. తొలుత గడువు ఇచ్చిన సెప్టెంబరు ఆఖరు వరకు చూస్తే 45శాతం మాత్రమే నమోదైనట్లు సమాచారం. కొన్ని మండలాల్లో వేగవంతంగా సాగుతున్నా మరికొన్ని మండలాల్లో తీవ్రజాప్యం జరుగుతోంది.

మద్దిపాడు మండలంలో 80.08శాతం నమోదు

అధికార వర్గాల సమాచారాన్ని బట్టి జిల్లాలో అత్యధికంగా మద్దిపాడు మండలంలో 80.08శాతం ఈ-క్రాప్ నమోదైంది. అది ఎర్రగొండపాలెంలో 76.50శాతం, గిద్దలూరులో 72.21శాతం, ఎన్‌జీపాడులో 69.98శాతం, త్రిపురాంతకంలో 63.73శాతంగా ఉంది. అత్యల్పంగా దర్శి మండలంలో 33.08శాతం విస్తీర్ణంలో నమోదవగా పుల్లలచెరువులో 33.63శాతం, తాళ్లూరులో 34.84శాతం, తర్లుపాడులో 34.87శాతం, సీఎస్‌పురంలో 35.98శాతం చేశారు. ఈనేపథ్యంలో ఈనెల 25 వరకు ప్రభుత్వం గడువు పెంచింది. ఆ వివరాలను గ్రామస్థాయిలోని రైతు సేవా కేంద్రాలలో ఈనెల 26 నుంచి 30 వరకు ప్రచురించి లోటుపాట్లు ఉంటే సవరిస్తారు. అనంతరం 31న తుది జాబితాలను ప్రచురిస్తారు. పెంచిన సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఈ-పంట నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తిచేయాలని సిబ్బందికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(డీఏవో) సీహెచ్.శ్రీనివాసరావు సూచించారు. అలాగే రైతులు కూడా సిబ్బందికి సహకరించాలని కోరారు.

చీరాల జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

ఇరువురికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

హుటాహుటిన వైద్యశాలకు తరలింపు



అపస్మారక స్థితిలో రత్నబాబు



దానియేలును హస్పిటల్‌కు తరలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్, స్థానికులు

తోటవారిపాలెం(చీరాల), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం తోటవారిపాలెం వద్ద 216 జాతీయ రహదారి వెంబడి సోమవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకొంది. అందిన వివరాల ప్రకారం.... ఒంగోలు నుంచి బాపట్ల వైపు వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన నక్క రత్నం, దానియేలుకు తీవ్రగాయాలయ్యాయి. వీరిరువురు బాబాయి అబ్బాయి వరుస అవుతారు. ప్రమాదంలో ఇరువురు అపస్మారక స్థితికి చేరారు. సమాచారం అందుకున్న ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. సిబ్బంది, స్థానికుల సహకారంతో క్షతగాత్రులను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు పక్కన పొలాల్లోకి దూసుకుపోగా, అందులోని భార్యాభర్తలు సురక్షితంగా బయటపడ్డారు.

బైకును ఢీకొన్న కారు

మార్టూరు, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై విజయవాడ నుండి ఒంగోలు వైపు వెళుతున్న కారు రోడ్డుప్రక్కన ద్వి చక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటన సోమవారం సాయంత్రం మండల పరిధిలో రాజుపాలెం కూడలి వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో హైవే రోడ్డుపనులు చేస్తున్న ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు కూలీలకు గాయాలయ్యాయి.అనంతరం వారిని హైవే అంబులెన్స్‌లో చిలకలూరిపేట లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.పూర్తి సమాచారం తెలియాల్సిఉంది.

గ్రంథాలయాల ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు

- 129 మంది విద్యార్థుల హాజరు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

అద్దంకి,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ఆధునిక గ్రంథాలయాలు ఆవశ్యకతపై అద్దంకి గ్రంథాలయ భవన సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం అద్దంకిలోని ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద విద్యార్థులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి 129 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హాజరైన విద్యార్థులందరికి పరీక్ష అట్టలను అందజేశారు. విజేతలకు 11వ తేది బహుమతులు అందజేయనున్నట్లు ఎంఈవో కేవీ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పలు హైస్కూళ్ల హెచ్‌ఎంలు శ్రీనివాసమూర్తి, గురవయ్య, పెంట్యాల గంగాధర్, అర్జున్, సుజాత, అద్దంకి గ్రంథాలయ భవన సాధన సమితి కార్యదర్శి రసూల్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార అసైన్డ్‌పై చర్యలేవి ?

(3వ పేజీ తరువాయి)

అసైన్డ్ భూమేననేది సమాచారం. ఆగమేఘాల మీద దాదాపు 280 ఎకరాలు రిజిస్ట్రేషన్ కూడా జరిగినట్లు రెవెన్యూ విభాగం ఇచ్చిన నివేదికలో పొందుపరిచారు. రాజకీయ పరపతిని ఉపయోగించుకుని గత ప్రభుత్వంలో దాదాపు 1,500 ఎకరాల అసైన్డ్ భూమిని గుట్టుచప్పుడు కాకుండా ఫ్రీహోల్డ్ చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ తంతు ఇప్పుడు కూడా నడుస్తూ ఉండడం ఆందోళన కలిగించేదిగా ఉంది. అసైన్డ్ భూముల్లో రొయ్యల సాగు మత్స్యశాఖ లెక్కల ప్రకారం 2,800 ఎకరాలుగా తేలింది. ఈ సంఖ్య 8 వేల ఎకరాల వరకు ఉండొచ్చని సమాచారం. ఈ సాగు మొత్తం అనధికారిక ఒప్పందాల ద్వారా అసైన్డ్ భూమిని చెరబట్టిన వారే చేస్తుండడం గమనార్హం. బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణం చేపడుతున్న భూమి అసైన్డ్ కాగా, దానిని విరాళం ఇచ్చారని చెప్పి గత ప్రభుత్వంలో సన్మాన సత్కారాలకు తెరతీయడం ఓ వింత. ఇక కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులంతా కలిసి అసైన్డ్ భూములను కొనుగోలు చేయడం చూస్తే.. చట్టాలంటే లెక్కలేని తనానికి నిదర్శనంగా కనబుడుతోంది. వీరికి గత పాలకుల అండదండలు లభించడం మరో విశేషం. వివిధ వేదికల మీద టీడీపీ నేతలు నిర్వహించిన ప్రజాదర్బార్‌లలో ఏకంగా 850 ఫిర్యాదులు రాగా ఇందులో 70 శాతం అసైన్డ్ లావాదేవీలకు సంబంధించినవే ఉండడం విస్తుగొలిపేదిగా ఉంది.

ఎందుకీ జాప్యం...

రెవెన్యూ విభాగం ఇచ్చిన నివేదికల్లోనే అసైన్డ్ అక్రమాలు నిజమని తేలింది. గత ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ చేసిన భూముల వివరాలు పాలకుల దగ్గర ఉన్నాయి. వీటన్నింటిని ప్రభుత్వం నిబంధనల ప్రకారం తిరిగి స్వాధీనం చేసుకుంటే వేల ఎకరాల ల్యాండ్ బ్యాంకుగా మారనుంది. జిల్లాను పారిశ్రామికంగా అత్యున్నత స్థాయిలో నిలపడానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది. మరెంతో మంది నిరుపేదలకు ఆ భూమి వరంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం అసైన్డ్ అక్రమాలపై కొరడా ఝుళిపించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

మహిళా మార్ట్‌లో అవినీతిపై నేడు విచారణ

- హాజరుకావాలని పలువురు ఉద్యోగులకు నోటీసులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒంగోలులోని మహిళా మార్ట్‌లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై మంగళవారం విచారణ జరగనుంది. పొదుపు సభ్యుల భాగస్వామ్యం, దాతల సహకారంతో సుమారు రూ.68లక్షల వ్యయంతో రెండేళ్ల క్రితం మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. అందులో భారీగా అవినీతి, నగదు దోపిడీ జరిగింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలపై మెప్మా మిషన్ డైరెక్టర్ భరత్‌తేజ్ స్పందించారు. విచారణ కమిటీని నియమించారు. ఆ మేరకు నెల్లూరుకు చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీలారాణి బృందం విచారణ ప్రారంభించింది. గత నెలలో ఒంగోలు వచ్చిన విచారణ కమిటీ పలు రికార్డులు స్వాధీనం చేసుకుంది. మంగళవారం చేపట్టబోయే విచారణకు మార్ట్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు నిర్వహణ బాధ్యతలు చూసిన సీఎం ఎంలు, సీవోలు, ఐబీలు, సిబ్బంది హాజరుకావాలని ఆదేశించింది. దీంతో మెప్మాలో పనిచేసి బదిలీపై వెళ్లిన వారితోపాటు, ప్రస్తుతం ఉన్న వారిలో 30మందికిపైగా సిబ్బంది ఉదయం 11 గంటలకు ఒంగోలులోని కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని పీడీ శ్రీహరి నోటీసులు జారీ చేశారు.

అవీ..ఇవీ..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీరాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, ఆ శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకనటలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దండుబాట రోడ్డు, జయశంకర్ నగర్, పాలేటీ నగర్, ఉజిలీపేట, ప్రకాష్‌నగర్ ట్యాంకు ప్రాంతాల్లో అలాగే మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు తోటవారిపాలెం, ముంతావారిసెంటర్, కూరగాయల మార్కెట్, చీరాల మసీదు సెంటర్, గడియారస్తంభం సెంటర్, బెస్తపాలెం, తెల్లగాంధీబొమ్మ సెంటర్‌లో అంతరాయం ఉంటుందని, అనంతరం యధావిధిగా సేవలు అందుతాయని అధికారులు తెలిపారు.

లక్ష్యం మేరకు పండ్ల తోటలు సాగు చేయాలి

బల్లికురవ, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): లక్ష్యం మేరకు గ్రామాలలో రైతులు పండ్ల తోటలు సాగుచేసేలా వారికి సిద్ధం చేయాలని డ్వామా ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్ అన్నారు. సోమవారం బల్లికురవలో అన్ని గ్రామాల ఉపాధి క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. 2025- 26 సంవత్సరాలకు గాను 101 ఎకరాల్లో పండ్లతోటలు సాగుచేసేలా ఇప్పటికే అంచనాలు తయారు చేసి ఇచ్చారని వారు వెంటనే పండ్లతోటలు సాగు చేయాలన్నారు. గత ఏడాది కూడా పలు గ్రామాలలో ప్లాంటేషన్‌లో అవకతవకలు జరిగాయని ముందుముందు ఇలా జరగకుండా పటిష్ఠంగా సిబ్బంది నిజమైన రైతులను గుర్తించి వారితో పండ్ల మొక్కలు నాటించాలన్నారు. మొక్కలు లేకుండా బిల్లులు పెడితే చర్యలు తప్పవు అన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ ఏపీవో రమాదేవి పాల్గొన్నారు.

పోషణపై తల్లులకు అవగాహన


పిల్లల తల్లులతో మాట్లాడుతున్న సీడీపీవో సుభద్ర

యద్దనపూడి, (మార్టూరు) అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి):పూర్వ బాలారంభవిద్యపై పిల్లల తల్లులకు ఐసీడీఎస్ పర్చూరు సీడీపీవో సుభద్ర అవ గాహన కలిగించారు. సోమవారం పోషణ మహ కార్యక్రమంలో భాగంగా యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీఈ పై తల్లులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సూపర్ వైజరు సుజాత అధ్యక్షత వహించగా,ముఖ్య అతిదిగా సుభద్ర విచ్చేశారు.అనంతరం జీఎస్టీపై రోజువారీ ఉపయోగించే వినియోగవస్తువులపై మరియు ఎలక్ట్రానిక్ పరికరాలపై తగ్గిన పన్ను గురించి ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు బి కోటేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ అధికారి తానియా,అంగన్వాడీ కార్యకర్తలుజి నవమ్మ,బి వసంతలక్ష్మి,జి కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన

ఇంకొల్లు, అక్టోబరు 6,(ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు మానసిక ఆరోగ్యానికి మూలమని బాపట్ల జిల్లా ఆరోగ్య కౌన్సిలర్ ప్యారిజాన్ అన్నారు. ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవంలో భాగంగా విద్యార్థులకు ఆహారపు అలవాట్లపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంఈవో ఏ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు విద్యార్థుల మానసిక సమతౌల్యంతో పాటు దృష్టి కేంద్రీకరణ ఆత్మవిశ్వాసం పెంచుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బాలకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ కిటకిట


అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో కిటకిటలాడుతున్న ప్రయాణికులు

అద్దంకి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగకు కుటుంబ సభ్యులతో స్వగ్రామాలకు వచ్చి తిరిగి వెళ్లే ప్రయాణికులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఇతర వర్గాల ప్రజలతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి పోయాయి. అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం నుంచే రద్దీ మొదలైంది. సోమవారం ప్రయాణికులు మరింత పెరిగారు. ఆదివారం అద్దంకి డిపో కు సుమారు రూ.16,14,648 ఆదాయం వచ్చినట్లు ఇన్‌చార్జ్ డీఎం మహబూబి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహిళాశక్తి పథకంతో మహిళా ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. విజయవాడ, శ్రీశైలంలకు నడిచే ఎక్స్‌ప్రెస్‌లతో పాటు గ్రామీణ ప్రాంతాలకు నడిచే పల్లెవెలుగు బస్సులలో కూడా ప్రయాణికుల రద్దీ కొనసాగింది. ఆదివారం 115 శాతం ఓఆర్‌తో రూ.16,14,648 ఆదాయం వచ్చింది. సోమవారం కలెక్షన్ రూ.18 లక్షలు దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం మధ్యాహ్నం సమయంలో కూడా ప్రయాణికులు కిక్కిరిసి పోయారు. ఉదయం, సాయంత్రం సమయాలలో రద్దీ మరింత ఎక్కువగా ఉంది.

నూలుమిల్లులో వ్యక్తి అనుమానాస్పదమృతి

ఇంకొల్లు, అక్టోబరు 6,(ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఇంకొల్లులోని ఎన్ఎస్ఎల్ నూలు మిల్లులో సోమవారం చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళ్లితే కారంచేడు మండలం కేశవరప్పాడు ఎస్సీ కాలనీకి చెందిన నేలపాటి కోటేశ్వరరావు(67) చాలా కాలంగా నూలుమిల్లులో పని చేస్తున్నాడు. సోమవారం యథావిధిగా ఇంటి వద్ద నుంచి విధులకు హాజరయ్యారు. వీవింగు విభాగం దగ్గరలోని భూగర్భంలోని ఓ గదిలో ఉరివేసుకొని అనుమానాస్పదంగా మృతిచెందాడు. నూలుమిల్లు యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. సీఐ వై.వి రమణ్య, ఎస్సై సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని వారు తెలిపారు.

'జీవనజ్యోతి బీమా' సొమ్ము అందజేత


బీమా చెక్కును అందజేస్తున్న చీఫ్ మేనేజర్ శీనానాయక్

బల్లికురవ, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందిస్తున్న బీమా పథకాలలో నమోదు చేసుకోవాలని బల్లికురవ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చీఫ్ మేనేజర్ శీనానాయక్ కోరారు. మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన బండారు బ్రహ్మయ్య అను రైతు స్థానిక బ్యాంకులో ప్రధాన మంత్రి జీవనజ్యోతి భీమా పథకంలో నమోదు అయి ఉన్నారు. ఆయన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. భీమా పథకం ద్వారా మంజురైన రూ.2 లక్షల చెక్కును మృతుని భార్య అరుణకు బ్యాంకు మేనేజర్ అందించారు. ఈసందర్భంగా ఆయన బీమా పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు బిందుమాధవి, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పర్చూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో నేడు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేకా ఆనందకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రద్యుమ్నాకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.





బల్లికురవ మండలంలో చెన్నుపల్లి చెరువు నుంచి పంట పొలాల్లోని ప్రవహిస్తున్న వరదనీరు, కొండాయపాలెం చప్టాపై నీరు, పంటపొలాల్లో నిలిచిన నీటిలో చేపలు పడుతున్న జాలర్లు, నీటమునిగిన వరిపైరు

దంచి కొట్టిన వాన

- పొంగి పొర్లిన వాగులు, చెరువులు
- పలు మార్గాల్లో నిలిచిన రాకపోకలు
- అధిక వర్షంతో వరి పైరుకు నష్టం
- ఆందోళనలో అన్నదాతలు

బల్లికురవ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం దంచి కొట్టింది. ఈ ప్రభావంతో రోడ్లన్ని జలమయమయ్యాయి. వాగులు చెరువుల నుంచి నీరు ఉధృతంగా ప్రవహించింది. ఈ ఏడాదికి ఇదే పెద్ద వర్షం అని ప్రజలు పేర్కొంటున్నారు. భారీ వర్షంతో గ్రామాలలో ఉన్న మురుగు కాలువలపై నుంచి నీరు ప్రవహించింది. చెన్నుపల్లి కొండాయపాలెం గ్రామాల మధ్య చెరువు అలుగు నీరు ఉధృతితో రాకపోకలకు ప్రజలకు ఇబ్బంది పడ్డారు. అలానే కొండాయపాలెం గ్రామంలో 50 ఎకరాల వరినాట్లు నీటమునిగాయి. చెన్నుపల్లి చెరువు నిండి నీరు పెద్ద పెట్టున రావడంతో ప్రజలు ఆందోళన చెందారు. చెరువలలో ఉన్న చేపలు సైతం నీటి నుంచి బయటకు రావడంతో చేపలు పట్టుకోనేందుకు జాలర్లు దూర ప్రాంతాల నుండి తరలి వచ్చి పట్టుకున్నారు. పలు చోట్ల కూరగాయాల పంటలు దెబ్బతిన్నాయి. గుంటుపల్లి ముక్తేశ్వరం గ్రామాల మధ్య నేల చప్టాపై నుంచి మూడు అడుగుల మేర నీరు పారింది. రాకపోకలు నిలిచి పోయాయి. కొణిదెన ఉప్పుమాగులూరు రోడ్డులో నేలచప్టాపై నుంచి వర్షపు నీరు రావడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. భారీ వర్షం వలన గ్రామాలలో వాగుల నుండి నీరు పెద్దపెట్టున రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నోఏళ్ల తర్వాత వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని రైతులు అంటున్నారు.

కొప్పెరపాడులో భారీ వర్షం

మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో భారీ వర్షం కురిసింది. ప్రజలు తీవ్ర ఇబ్బందికి లోనయ్యారు. ఎస్సీ కాలనీ నుంచి వర్షపునీరు బయటకు వెళ్లే కాలువ లేకపోవడంతో వర్షపు నీరు గృహాలలోకి చేరింది. అలానే రోడ్డుపై నుంచి నీరు పారడంతో ప్రజలు గృహాలలో నుంచి బయటకు వచ్చేందుకు భయపడిపోయారు. అలానే ఉన్నత పాఠశాల పక్కవీధిలో వర్షపు నీరు రోడ్డుపై పెద్ద ఎత్తున నిలబడడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. విద్యార్థులు పాఠశాలకు నీటిలో నుంచే రావాల్సి ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. మురుగు కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై చేరిందని ప్రజలు అంటున్నారు. ఎస్సీ కాలనీలో ఎన్నో ఏళ్ల నుంచి సమస్య ఉందని వర్షం కురిస్తే చాలు నీరు గృహాలలోకి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు వెంటనే వర్షపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు

పర్చూరు : రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, కాలువలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు కాలనీలు, శివారు ప్రాంతాలు జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. రహదారుల్లో ఎక్కడ చూసినా నీటితో నిండిపోయి రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందిగా మారింది. వర్షాలతో పర్చూరు వాగుకు భారీగా నీరు చేరింది. ఇటీవల వాగు కరకట్టలను అభివృద్ధి చేయడంతో కొంతవరకు వరద ముప్పు తప్పింది. అయితే కొంతభాగం కరకట్టలు బలహీన పడడంతో భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని వాగు కరకట్టలను మరింత పటిష్ఠంగా నిర్మిస్తే పంట పొలాలు ముంపుకు గురికాకుండా కాపాడుకోవచ్చని అన్నదాతలు అంటున్నారు. ఆ దిశగా వాగు కరకట్టలను పటిష్టతపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యద్దనపూడి,(మార్టూరు) : యద్దనపూడి మండలంలోని తాగు, సాగునీటి చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. మండలంలోని గ్రామాలలోని ప్రతి చెరువులో నీరు 90 శాతం వరకు చేరింది. మండలంలో 15 చెరువులు ఉన్నాయి. కొన్నిరోజుల నుంచి సాగర్ జలాలు రావడంతో వాటితోనే చెరువులను చాలా వరకు నింపాయి. దీనికితోడు అడపాదడపా కురుస్తున్న వర్షాలకు, ఆదివారం కురిసిన భారీ వర్షానికి మరింతగా చెరువులు నిండాయి. వాస్తవంగా అనంతవరం చెరువు 55 శాతం నిండగా, ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి 90 శాతానికి పైగా చెరువు నిండింది. అదేవిధంగా యద్దనపూడి, చింతపల్లిపాడు, గన్నవరం, శ్యామలవారిపాలెం, యనమదల తదితర గ్రామాలలోని చెరువులలో నీళ్ల సమృద్ధిగా చేరాయి. ఇక వర్షాలకు పోలూరు వాగు తూముల చప్టాపై నుండి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సోమవారం పోలూరు గ్రామానికి మండల కేంద్రమైన యద్దనపూడి గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. వాగు నీటిప్రవాహం ఉధృతంగా ఉన్నందున పోలీసు, రెవెన్యూ అధికారులు వాగును దాటకుండా ప్రజలను కట్టడిచేశారు. చిన్నవాగులలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. యనమదల గ్రామంలో ఎస్సీ కాలనీలో భారీ వర్షం కారణంగా కాలనీలో మూడు అడుగులకు పైగా నీళ్ల నిలిచాయి.


పొంగి పొర్లుతున్న కప్పలవాగు


నీటితో నిండిన అనంతవరం చెరువు


:పోలూరు వాగు వద్ద స్తంభించిన రాకపోకలు

పొంగిన కప్పలవాగు.. నిలిచిన రాకపోకలు

ఇంకొల్లు : మండల పరిధిలోని పాత మద్రాసు రోడ్డులోని పూసపాడు అడ్డరోడ్డు వంకాయలపాడు మధ్య ఉన్న కప్పలవాగు ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు నేలచప్టాపై నీరు పొంగి ప్రవహించింది. దీంతో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. ఉన్న వంతెన శిధిలావస్థకు చేరడంతో నేలచప్టా నిర్మించారు. దీంతో చిన్నపాటి వర్షానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై సురేష్ అక్కడకు చేరుకొని ఎటువంటి ప్రమాదం జరగకుండా తమ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశారు.





ఉధృతంగా ప్రవహిస్తున్న పర్చూరు వాగు, గుంటుపల్లి -ముక్తేశ్వరం చప్టాపై నిలిచిన నీరు, కొప్పెరపాడులో వరదనీటిలో స్కూలికి వెళుతున్న విద్యార్థులు, ఎస్సీ కాలనీలోనికి చేరిన నీరు

పోరాట యోధుడు వడ్డే ఓబన్నకు ఘన నివాళులు


ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు

చినగంజాం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : చినగంజాంలో రేనాటి పాలెగాడు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రధాన సైన్యాధిపతి వడ్డే ఓబన్న వర్ధంతి కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వైసీపీ మండల అధ్యక్షులు మున్నం వెంకటనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఓబన్న చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి 10 ఏళ్ల ముందే బ్రిటిష్ వారి పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రధాన సైన్యాధ్యక్షుడిగా ఓబన్న పాత్ర ఎంతో ప్రాముఖ్యమైనదన్నా రు. దేశానికి ఆయన సేవ లను పలువురు నాయకుల కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మేడికొండ సునీల్, కొల్లాటి ఏడుకొండలు, కొండూరి గోవిందు, మార్కా పురం వెంకటరామారావు, పాదర్తి ప్రకాష్, గుమ్మడి ఉమాశంకర్‌రెడ్డి, ఆసోది సూర్యనారాయణరెడ్డి, పఠాన్‌బాబు, షేక్ సైదా, సాయి, మహేష్ పాల్గొన్నారు.


వేటపాలెంలో మాట్లాడుతున్న వడ్డెరసంఘ నేతలు

వేటపాలెం(చీరాల) : స్వాతంత్ర్య సమర యోధులు వడ్డే ఓబన్న వర్ధంతి వేడుకలు వేటపాలెంలో ఘనంగా నిర్వహించారు. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లెం అంజమ్మ, ఆ సంఘం పెద్దకాపు తన్నీరు బసవయ్య ముఖ్య అతిథులుగా ఏర్పాటు చేసిన సమా వేశంలో ఓబన్న పోరాట ప్రతిమ, త్యాగాలను వివరించారు. ప్రతి ఒక్కరూ అలనాటి పోరాటవీరుల ఆదర్శాలను ఆశయాలుగా అందిపుచ్చుకుని ఉన్నతంగా రాణించాలని అన్నారు. అంతకు ముందు ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మల్లెల శ్రీను, రవి, పల్లపు శ్రీను, గంగరాజు, వెంకటేశ్వర్లు, మంగరాజు, రాజేశ్వరీ, లక్ష్మీ, వాణీ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు నిరాశ్రయుడు


కుటుంబ సభ్యులకు వృద్ధుడిని అప్పగిస్తున్న పోలీసులు

చీరాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా వైద్యశాల వద్ద ఆశ్రయం పొందుతూ కుటుంబ సభ్యులకు దూరమైన వృద్ధుడిని పోలీసులు కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. బాషాఖాన్ అనుకోని రీతిలో కుటుంబానికి దూరం కాగా, 'ఆంధ్రజ్యోతి'లో ఆయన దీనావస్థపై కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన డీఎస్పీ ఎండీ మొయిన్ శక్తి టీం ఎస్సై హరిబాబు, కానిస్టేబుల్ సుబ్బారావుకు సూచనలు చేశారు. వారు పెదవడ్లమూడిలోని బంధువులకు సమాచారం అందించడంతో పాటు సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పంగులూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జె.పంగులూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, పంచాయితీ కార్యదర్శులు హాజరు కావలసిందిగా ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

గోతుల్లో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

- అవస్థలు పడి ప్రైవేట్ వాహనాలలో వెళ్లిన ప్రయాణికులు


రాజుపాలెం వద్ద గోతులలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

బల్లికురవ. అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలం లోని కొణిదెన- మార్టూరు గ్రామాల మధ్య ఉన్న రోడ్డులో ఆర్టీసీ బస్సు సోమవారం రోడ్డుపై ఉన్న పెద్ద గోతులలో కురుకు పోయింది. దీంతో బస్సులోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రోడ్డు బాగా దెబ్బతినడంతో పాటు వర్షం పడడంతో గోతులలో నీరు ఉండడంతో బస్సు దిగబడిందిని ప్రయాణికులు తెలిపారు. అద్దంకి నుంచి చిలకలూరిపేట వెళ్లి తిరిగి వస్తుండగా రాజుపాలెం గ్రామ సమీపంలో బస్సు నిలిచి పోవడంతో ప్రయాణికులు మార్గమధ్యలో ఉండి పోవాల్సి వచ్చింది. కొందరు ఆటోలను పిలిపించుకొని తమ గమ్యాలను తరలి వెళ్లారు.

ఉత్తమ సేవలకు స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం


కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదగా ఉత్తమ సేవల పత్రం అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

అద్దంకి, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి):అద్దంకికి ఐదు స్వచ్ఛాంధ్ర అవార్డులు వచ్చాయి. స్వచ్ఛ మున్సిపాలిటీగా జిల్లా స్థాయి లో అద్దంకి మున్సిపాలిటీ ఎంపికైంది. వివిధ విభాగాల్లో మున్సిపాలిటీకి మూడు అవార్డులు దక్కాయి. సోమవారం బాపట్ల లో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రవీంద్ర అవార్డును జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావుల నుంచి అందుకున్నారు. అదేవిధంగా అద్దంకి వ్యవసాయమార్కెట్ కమిటీ కూడా ఎంపిక కావడంతో ఏఎంసీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి సూర్య ప్రకాష్‌రెడ్డి అందుకున్నారు. ప్రకాశం ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలకు అవార్డు దక్కింది.

మార్టూరు, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి):మార్టూరులోని అవనీర్ గ్రానైట్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డు దక్కింది. ఈ మేరకు సోమవారం రాత్రి బాపట్లలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్ చేతులమీదగా గ్రానైట్ పరిశ్రమ యజమాని చెరుకూరి అంజిబాబు, మాజీ గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు ఇంటూరి ఆంజనేయులు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. వాతావరణ కాలుష్యానికి దూరంగా, పర్యావరణ సమస్యలు లేకుండా, ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా గ్రానైట్ పరిశ్రమలను నిర్వహించడం అభినందనీయమన్నారు. మిగిలిన గ్రానైట్ పరిశ్రమల యజమానులు కూడా అవార్డు పొందిన గ్రానైట్ పరిశ్రమను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు పత్తిపాటి సురేష్, తాటి నాగేశ్వరరావు, కొర్రపాటి వేణు, ఎస్ శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితర గ్రానైట్ పరిశ్రమ యజమానులు పాల్గొన్నారు.

పర్చూరు :పర్చూరు ప్రభుత్వ వైద్యశాల (సీహెచ్‌సీ) జిల్లా స్థాయి స్వచ్ఛతా అవార్డుకు ఎంపికయ్యింది. సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా వైద్యశాల సూపరిండెంట్ సౌమ్య అవార్డును అందుకున్నారు. ఇటీవల నిర్వహించిన స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పర్చూరు వైద్యశాలకు లభించింది.

గ్రీన్ అంబాసిడర్ పోలయ్యకు జిల్లా అవార్డు

పంగులూరు : మండలంలోని రామకూరు గ్రామ పంచాయతీకి చెందిన గ్రీన్ అంబాసిడర్ వేటగిరి పోలయ్యకు జిల్లా అవార్డు లభించింది. వేటగిరి పోలయ్య సేవలను గుర్తించిన అధికారులు జిల్లాస్థాయిలో ఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్ అవార్డుకు ఎంపికచేశారు. అవార్డుకు ఎంపికైన పోలయ్యను ఎంపీడీవో కే.స్వరూపారాణి, డిప్యూటీ ఎంపీడీవో కె.సుమంత్, పంచాయతీ కార్యదర్శి శిరీష, మండలంలోని పంచాయితీ కార్యదర్శులు అభినందించారు.




అవార్డు అందుకుంటున్న పారిశ్రామిక వేత్తలు అంజిబాబు, ఆంజనేయులు, పర్చూరు వైద్యురాలు డాక్టర్ సౌమ్య, అద్దంకి ఏఎంసీ కార్యదర్శి సూర్యప్రకాశ్‌రెడ్డి